
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM
సోమవారం, 16 డిసెంబరు 2024



పర్యాటకానికి జోష్..

- భద్రాద్రికి వచ్చిన పంచతంత్ర స్టూడియో, రైస్‌వాటర్ ప్రాజెక్టు..
- బృందంతో కలిసి పర్యటించిన కలెక్టర్ జితేష్ వి. పాటిల్
- స్థల పురాణాలపై ఆసక్తి చూపిన సభ్యులు
- ఆధ్యాత్మిక, పర్యాటక అంశాలపై డాక్యుమెంటరీ కోసం చిత్రీకరణ

7

వానాకాలంలో సెప్టెంబరు ఒకటో తేదీన పాలేరు జలాశయానికి వరద పోటెత్తడంతో ఆ వరద తాకిడికి పరీవాహక ప్రాంతంలోని పొలాల్లో పేరుకుపోయిన ఇసుకమేటలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. దీంతో ఇప్పటికే వానాకాలం పంటను కోల్పోయిన రైతులు తాజాగా యాసంగి పంటనూ కోల్పోవాల్సి వస్తోంది. గతంలో చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా విధంగా పాలేరుకు వరద పోటెత్తింది. రాత్రికి రాత్రే రెండులక్షల క్యూసెక్కులనీరు వరదై పారింది. దీంతో పరీవాహక ప్రాంతంలోనూ, పాలేరు ఏటి పరిసరాల ప్రాంతాల్లో సాగులో ఉన్న వరిపొలాలన్నీ నీటమునిగాయి. వందలాది ఎకరాల్లో ఇసుకమేటలు వేసింది.



కూసుమంచి మండలం హట్యతండా వద్ద పొలాల్లో ఇసుక మేటలు(ఫైల్)

కన్నీటి మేటలు

తొలిగేదెలా?

- వందల ఎకరాల్లో పేరుకుపోయిన ఇసుకమేటలు
- యాసంగి పంటనూ కోల్పోతున్నరైతులు
- ఇసుక తొలగించేందుకు ఎకరాకు రూ.2లక్షల పైనే ఖర్చు
- ప్రభుత్వమే ఆదుకోవాలంటున్న బాధిత రైతులు

సెప్టెంబరు వరదలతో జిల్లాలో 28వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

కూసుమంచి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో 27వేల మంది రైతులకు చెందిన సుమారు 28వేల ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. పాలేరు ఏటికి సమీపంలో కూసుమంచి మండలంలో పాలేరు, హట్యతండా, నర్సింహులగూడెం, కొత్తూరు, గోరీలపాడు తండా, తుమ్మలతండ, జక్కేపల్లి, గ్రామాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. సుమారు రెండు అడుగుల మేర ఇసుక మేటలు వేయడంతో పొలాలు ఎడారులను తలపిస్తున్నాయి. అయితే అప్పటికే వరినాట్లు పూర్తవడంతో ఇసుకమేటలను తొలగించుకునేందుకు వీలుపడలేదు. ప్రస్తుతం వానాకాలం పంట పూర్తవ్వడంతో ఇసుకమేటలను తొలగించుకునేందుకు ప్రయత్నించగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పొలాల్లో ట్రాక్టర్లు దిగబడుతుండటంతో వీలుపడటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో యాసంగి పంటనూ కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఖర్చు రూ.2లక్షల పైమాటే

వరిపొలాల్లో ఇసుక మేటలను తొలగించేందుకు సుమారు రూ.2లక్షలకు పైగా ఖర్చవుతుందని రైతులు తెలిపారు. సుమారు రెండు అడుగుల ఎత్తులో ఇసుక మేటలు వేసిందని, దానిని బయటికి తరలించేందుకు ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌ల ఖర్చు ఎక్కువ అవుతుందని పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇటీవల తాత్కాలికంగా ఎకరాకు రూ.10వేలు పరిహారంగా ఇచ్చిందని తెలిపారు. కానీ ఇసుకమేటలు తొలగించడం ఆర్థికభారంగా మారిందని తెలిపారు. ఎలాగైనా ప్రభుత్వమే పరిశీలించి మేటలు తొలగించేందుకు ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.

మంత్రులు చొరవ తీసుకోవాలి

రైతులకు కలిగిన నష్టంపై స్థానిక ఎమ్మెల్యే, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. ఒకసారి మేట వేసిన రైతుల వరి పొలాలను పరిశీలించాలని కోరారు. ప్రభుత్వం ద్వారా ఇసుక తొలగింపు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. లేనిపక్షంలో ఇబ్బందులు తప్పవని అంటున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి

బాదావత్ రవి, హట్యతండా



నాకు ఏడెకరాల పొలం ఉంది. అందులో మూడెకరాల్లో ఇసుక మేట వేసింది. నాలుగు ఎకరాల్లో సారవంతమైన భూమి కొట్టుకపోయి బండతేలింది. సాగుకు యోగ్యంగా లేకుండాపోయింది. తీవ్రంగా నష్టపోయాం. ఎకరాకు రూ.2లక్షలు ఖర్చు అవుతుంది. అంతభారం మోయలేని స్థితిలో ఉన్నాం. నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలి. ఇసుకమేటలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలి.

సంక్రాంతి నుంచి

రైతు భరోసా

- కొత్తగూడెంతోపాటు మరో మూడుచోట్ల విమానాశ్రయాలు
- 28న వ్యవసాయ కూలీలకు ఆర్థిక సాయానికి శ్రీకారం
- ప్రజలు బీఆర్ఎస్ గోబెల్స్ ప్రచారాన్ని నమ్మరు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ఖమ్మం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సంక్రాంతి నుంచి అన్నదాతలకు రైతు భరోసా సాగు సాయం అందిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలో కొత్తగూడెంతోపాటు వరంగల్, రామగుండం, ఆదిలాబాద్‌లో విమానాశ్రయాలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీలకు రెండు విడుతలుగా ఏడాదికి రూ.12వేలు పంపిణీ చేయబోతున్నామని, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినమైన డిసెంబరు 28న ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామని ప్రకటించారు. ఖమ్మంజిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అప్పులపై బీఆర్ఎస్ నేతలు ప్రజలను పక్కదారి పట్టించేలా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా రెసిడెన్షియల్ హాస్టల్ విద్యార్థులకు 40శాతం డైట్ ఛార్జీలు పెంచామని, దీనివల్ల ప్రభుత్వానికి రూ.541కోట్ల భారం పడిందన్నారు. అయినా ప్రభుత్వ హాస్టల్స్ బాగా లేవంటూ బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా యూనివర్శిటీ చేస్తున్న ఈ విషప్రచారాలను రాష్ట్ర ప్రజలు నమ్మరన్నారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన ఆర్థిక విధ్వంసం అప్పులపైనా అసెంబ్లీలో శ్వేత పత్రం విడుదల చేసి ప్రజలకు వాస్తవాలు వివరిస్తామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా, ఆరు గ్యారెంటీల అమలు దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా రూ.2లక్షల లోపు ఉన్న రైతులకు రూ.21వేల కోట్లు మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని తెలిపారు. ఈ ఏడాది రైతులకోసం రూ.50,953కోట్లు ఖర్చు చేశామన్నారు. రాష్ట్రంలో కొత్తగా కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్, (మిగతా 6వ పేజీలో)

కిడ్నీ వ్యాధి కబళిస్తోంది..



- రెండు నెలల్లో ముగ్గురి మృత్యువాత
- అనంతారం గ్రామ ప్రజల్లో ఆందోళన

6

రంగస్థల దీపస్తంభం



- కళామతల్లి సేవలో తరిస్తున్న పుట్టంబాక శ్రీకృష్ణప్రసాద్
- ఎందరో కళాకారులకు, కళా ప్రదర్శనలకు మార్గదర్శకం

7



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

తెలుగు సాహిత్యంలో కవిత్వానికి, కథలకు విశిష్ట స్థానం

- ఘనంగా ఖమ్మం ఈస్థటిక్ సాహిత్య పురస్కారాలు
- ముగిసిన కథాంతరంగం కార్యక్రమం

6



అభ్యర్థులను తనిఖీ చేసి లోనికి పంపిస్తున్న దృశ్యం

ఉమ్మడి జిల్లాలో గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతం

- ఒక నిమిషం నిబంధనతో ఇబ్బందులు
- ఇరుజిల్లాల్లో సగంకన్నా తక్కువగా హాజరైన అభ్యర్థులు

6



రామయ్య సన్నిధిలో కృత్తికా దీపోత్సవం

- ఉత్సవమూర్తులకు సహస్రధారాభిషేకం
- స్వామివారికి ఘనంగా తిరువీధి సేవ.. చొక్కాసుర దహనం

6

భూమిని కాపాడుకుందాం

- ఎస్‌పీకే సేంద్రియసాగు విధానంపై రైతులు అవగాహన పెంచుకోవాలి
- ఫిబ్రవరి 15 నుంచి 24వ వరకు యువరైతులకు శిక్షణ
- సుభాష్ పాలేకర్ ప్రథమ శిష్యుడు విజయరామ్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖ సేంద్రియ సాగు రైతు విజయరామ్

ఖమ్మంటౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భూమికి విష రసాయనాలు ఇవ్వటం వల్ల ప్రకృతిలో జీవరాసులకు, ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని ప్రకృతి వ్యవసాయ ప్రచారకుడు, పద్మశ్రీ సుభాష్ పాలేకర్ ప్రథమ శిష్యుడు, సేంద్రియసాగు ప్రముఖ రైతు విజయరామ్ తెలిపారు. ఎస్‌పీకే(సుభాష్ పాలేకర్ కృషి) సేంద్రియసాగుతో భూమిని కాపాడుకుందామన్నారు. ఖమ్మంలో ఆదివారం ఈఆర్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో సేంద్రియసాగుపై జరిగిన రైతు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ సుభాష్ పాలేకర్ కృషి (ఎస్ఆర్‌కే) విధానంతో రైతులు సేంద్రియ సాగు చేయాలన్నారు. భూమి ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. తాము సూచించిన సేంద్రియ సాగువల్ల రైతులు ఆర్థికంగా ఎంతో బలపడతారన్నారు. ఎప్పుడూ ఒకే పంట కాకుండా బహుళ వార్షిక పంటల సాగు వల్ల రైతులు ఎక్కువ ఆదాయం పొందగలుగుతారన్నారు. వికారాబాద్‌లో రసాయన ఎరువులతో (మిగతా 6వ పేజీలో)



ఆంధ్రా నుంచి తెలంగాణలోకి వస్తున్న ధాన్యం లారీలు

- ఆంధ్రా నుంచి తెలంగాణలోకి అక్రమంగా తరలింపు
- వందల లారీలు వస్తున్నా.. పట్టించుకోని అధికారులు
- వల్లభి, చెరువుమాధారం వద్ద అడ్డుకున్నరైతులు
- విషయం తెలుసుకొని సంఘటనా స్థలానికి సివిల్ సప్లయీస్ జిల్లా అధికారి
- వల్లభి చెక్‌పోస్టు నుంచి 31 లారీలు వెనక్కి మళ్లింపు
- అప్పటికే ఫైన్‌లతో 60 లారీలకు అనుమతి
- ఏపీ ధాన్యాన్ని అడ్డుకోవాలని రైతుల డిమాండ్

సరిహద్దు దాటుతున్న

సన్నధాన్యం..

ముదిగొండ/నేలకొండపల్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులు పండించిన సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుండటంతో ఏపీలోని కొందరు వ్యాపారులు అక్రమంగా రాష్ట్రంలోని పలు మిల్లులకు ధాన్యాన్ని తరలిస్తున్నారు. గత కొద్దిరోజులుగా ధాన్యం అక్రమ రవాణా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. తెలంగాణలో సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతోపాటు క్వింటాకు రూ.500చొప్పున ప్రభుత్వం బోనస్ ఇస్తోంది. ఇదే అదునుగా భావించిన అక్రమార్కులు ధాన్యాన్ని తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్నారు. ఏపీలోని విజయవాడ, తెనాలి, గుంటూరు, మచిలీపట్నంతో పాటు పలు ప్రాంతాల నుంచి దళారులు వందల లారీల ధాన్యాన్ని తెలంగాణలో విక్రయిస్తున్నారు. తెలంగాణ-ఆంధ్రా సరిహద్దు ప్రాంతమైన ముదిగొండ మండలం వల్లభి చెక్‌పోస్టు నుంచి నేలకొండపల్లి మండలం మీదుగా సూర్యాపేట జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడెం ప్రాంతాల్లోని రైస్‌మిల్లులకు ధాన్యాన్ని తరలిస్తున్నారు. పెద్దసంఖ్యలో గ్రామాల మీదుగా వస్తుండటంతో వల్లభి గ్రామంలో కొద్దిరోజులుగా లారీల్లో అక్రమంగా ధాన్యం తరలిస్తున్నారని స్థానిక రైతులు అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నారు. అయినా సరిహద్దు చెక్‌పోస్టుల్లో కొంతమంది సిబ్బంది డబ్బు వసూలు చేసి ఆంధ్రా నుంచి వచ్చే ధాన్యం లారీలను రాష్ట్రంలోకి అనుమతిస్తున్నారని వల్లభి వద్ద రైతులు ఆదివారం ఏపీ నుంచి వస్తున్న ధాన్యం లారీలను అడ్డుకున్నారు. నిన్నటి వరకు భారీగా ధాన్యం తరలినా (మిగతా 6వ పేజీలో)



సాగర్ రెండోజోన్

ఆయకట్టుకు నీటి తగ్గింపు

- పాలేరు నీటి మట్టం తగ్గడమే కారణం

కూసుమంచి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పాలేరు జలాశయం నుంచి ఖమ్మం జిల్లా రెండోజోన్ సాగర్ ఆయకట్టుకు అధికారులు నీటివిడుదల తగ్గించారు. పాలేరు జలాశయం నీటిమట్టం తగ్గుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. పాలేరు జలాశయం గరిష్ఠ నీటిమట్టం 23 అడుగులు కాగా, ప్రస్తుతం 14అడుగులకు తగ్గింది. మొదటిజోన్ నుంచి 3,952 రిజర్వాయర్‌కు క్యూసెక్కులనీరు చేరుతుండగా, రెండోజోన్ ఆయకట్టుకు గతంలో 3,205 కూసెక్కులు విడుదల చేస్తుండగా వాటిని తగ్గించి 2,126 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేస్తున్నారు. పాలేరు పాతకాల్వకు 150 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ప్రాజెక్టుకు 135 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం కోతలు పూర్తయిన ప్రాంతాల్లో నారుమళ్లు పెంచుకుంటుండగా నీటికి ప్రాధాన్యం పెరిగింది.

ప్రజలకు సకాలంలో వైద్య సేవలను అందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రులు నిలువెల్లా నిర్లక్ష్యంతో కూనారిల్లుతుంటే మరో వైపు గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం శుద్ధజలాన్ని అందించకపోవడంతో ప్రజలు వ్యాధుల బారిన పడి మరణాలకు చేరువవుతున్నారు. మండలంలోని అనంతారం గ్రామంలో కిడ్నీ రుగ్మతలతో పలువురు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. మూడేళ్లుగా ఈ వ్యాధి పట్టిపీడిస్తూ మరణాలు సంభవిస్తున్నా వైద్యశాఖ వ్యాధి ప్రబలడానికి కారణాలను తెలుసుకోలేకపోతోంది. దీంతో గత మూడేళ్లలో గ్రామంలో 10మంది ఈ వ్యాధితో మృతి చెందారు. కాగా రెండు నెలల వ్యవధిలో మరో ముగ్గురు మృత్యువాత పడ్డారు. వీరిలో ఆదివాసీలే ఎక్కువమంది ఈ వ్యాధికి బలికావడం గమనార్హం.


కిడ్నీ వ్యాధి బారినపడి నడవలేకపోతున్న కోరం నాగేశ్వరరావు

కిడ్నీ వ్యాధి కబళిస్తోంది..

- రెండు నెలల్లోనే ముగ్గురి మృత్యువాత
- అనంతారం గ్రామ ప్రజల్లో ఆందోళన
- ఆదివాసీల్లోనే అధికంగా ప్రబలుతున్న మహమ్మారి
- సకాలంలో అందని డయాలసిస్ సేవలు
- వైద్య, తాగునీటి సరఫరా శాఖల నిర్లక్ష్యం

జూలూరుపాడు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతారం గ్రామంలో కిడ్నీ వ్యాధి మహమ్మారి విజృంభిస్తోంది. గడిచిన రెండు నెలల్లో గ్రామానికి చెందిన 33 సంవత్సరాల యువకుడు కోరం నరేష్, ఎనిమిదేళ్ల బాలిక పాలెపు సాహితి, 30సంవత్సరాల ఆదివాసీ యువతి పూనెం ప్రేమలత కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతిచెందారు. దీంతో గ్రామ ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గ్రామంలో మరో 30 నుంచి 50మంది కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్థుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటంతో ప్రజలు వణికిపోతున్నారు.

కిడ్నీ వ్యాధి సోకిన బాధితులు జూలూరుపాడులోని ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సౌకర్యం లేకపోవడంతో కొత్తగూడెం, ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. కాగా ఈ ఆసుపత్రిలో పడకల కొరత ఉందని సిబ్బంది చెప్పి వ్యాధిగ్రహస్తులను తిప్పి పంపుతున్నారు. ఆర్థికంగా కాస్తా ఉన్న వారు ప్రైవేట్ ఆసుపత్రుల్లో డయాలసిస్ సేవలను పొందుతుండగా, కొంతమంది పేద ఆదివాసీలు ఆర్థిక లేమి కారణంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో సేవలు పొందలేక మంచం పట్టారు.

అంతుచిక్కని కారణాలు...

మూడేళ్లుగా అనంతారం గ్రామంలో ప్రజలను కిడ్నీ వ్యాధి పట్టిపీడిస్తున్నప్పటికీ వైద్యశాఖ మాత్రం కారణాలు తెలుసుకోలేకపోయింది. ఎందుకు ప్రజలు మూత్ర పిండాల వ్యాధి బారిన పడుతున్నారో అంచనా వేయలేకపోతున్నారు. తాగునీటి సరఫరాశాఖ విభాగం సిబ్బంది కూడా నిర్లక్ష్యం వహించడంతో ఈ పరిస్థితి దాపరించిందని ప్రజలు అంటున్నారు. కనీసం తాగునీటి పరీక్షలను కూడా చేయించలేదని వాపోతున్నారు. తాగునీటిలో క్లోరిన్‌శాతం అధికంగా ఉండటంతో ఈ సమస్య ఏర్పడిందని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజులు క్రితం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌ను కలసి గ్రామంలో నెలకొన్న కిడ్నీ వ్యాధి సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కాగా వ్యాధి ప్రబలటానికి గల కారణాలను గుర్తించాలని ఎమ్మెల్యే వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఇప్పటికైన వైద్య, నీటి సరఫరా విభాగం శాఖల సిబ్బంది గ్రామాన్ని సందర్శించాలని, నీటి పరీక్షలు నిర్వహించడంతోపాటు వ్యాధికి కారణాలను గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు.

చికిత్సకు ఆర్థిక స్థోమత లేదు...

పాలెపు ముత్తయ్య, అనంతారం



మా ఊరిలో మూత్రపిండాల జబ్బుతో చాలా మంది బాధ పడతున్నారు. నేనూ గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధి సోకి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాను. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డయాలసిస్ సేవలు అందే పరిస్థితి లేదు. ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో మంచానికే పరిమితమయ్యా.

వ్యాధి కారణాలను గుర్తించాలి

కుర్సం రమేష్, అనంతారం



అనంతారం గ్రామంలో ప్రజలకు కిడ్నీ వ్యాధి వ్యాప్తికి గల కారణాలను గుర్తించాలి. మూడేళ్లగా ఈ వ్యాధితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికి వ్యాధి వ్యాపించాడానికి గల కారణాలను గుర్తించకపోవటం తగదు. తాగునీటి పరీక్షలు చేయించాలి.

తాగునీటి నమూనాలను సేకరించాం

బి.వెంకటేశ్వర్లు, ప్రభుత్వ వైద్యాధికారి

ఇటీవల అనంతారం గ్రామాన్ని వైద్య, తాగునీటి సరఫరా సిబ్బంది సందర్శించి తాగునీటి నమూనాలను సేకరించాం. పరీక్షలకోసం ల్యాబ్‌కు పంపించాం. నివేదిక రాగానే వ్యాధి ప్రబలటానికి గల కారాణాలను ప్రజలకు తెలియజేస్తాం. మహమ్మారిని అరికట్టడానికి తగిన చర్యలు తీసుకుంటాం.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

- ఉద్యోగ,ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి
- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి
- ముగిసిన యూటీఎఫ్ 6వ జిల్లా మహాసభలు


ప్రసంగిస్తున్న చావా రవి

సత్తుపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయులు అందరికీ అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి అన్నారు. సత్తుపల్లి బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులు జరుగుతున్న 6వ జిల్లా మహాసభలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా చావా రవి మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్‌లోని ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా హామీలను నేరవేర్చి న్యాయం చేయాలని, ఇప్పటికే గత ప్రభుత్వం సృష్టించిన అగాధాలను పూడ్చే ప్రయత్నం చేయాలన్నారు. ఎన్ఈపీ నూతన జాతీయ విద్యా విధానం 2020ను రద్దుచేసి రాజ్యాంగ ఆశయాలకు అనుగుణంగా శాస్త్రీయ విద్యావిధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సాధించుకున్న నాటినుంచే, కాకముందు నుంచి కూడా అనేక సమస్యలు పెరిగాయని, దానిమూలంగా విద్యారంగంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో ఆందోళన పెరిగిందన్నారు. కేజీబీవీ, యూఆర్ఎస్ ఉపాధ్యాయులను రెగ్యూలరైజ్ చేసి రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న అందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, జీవో 317అప్పీళ్లను పరిష్కరించానలి, పెండింగ్ బిల్లులు అన్నింటినీ తక్షణమే చెల్లించాలని కోరారు. ఈ-కుబేర్‌లో పెండింగ్ లేకుండా ఎప్పటి బిల్లులు అప్పుడే చెల్లించాలని, రిటైర్ కావడంతోనే మోనటరీ (ఆర్థిక) బెనిఫిట్స్ ఆలస్యం లేకుండా చెల్లించాలని, పీఆర్‌సీని తక్షణమే అమలు చేయాలని, పెండింగ్‌లోని 4డీఏలను తక్షణమే ప్రకటించాలని అన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ అన్నిరకాల జబ్బులకు ఇన్‌పేషంట్, అవుట్ పేషంట్ అయినా సరే చెల్లించాలని, కార్పొరేట్ హాస్పిటల్‌లో అమలయ్యేలా హెల్త్ కార్డులు రూపొందించాలని చెప్పారు.

ఈ మహాసభల్లో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సీహెచ్ దుర్గాభవానీ, రాష్ట్ర ఎన్నికల అధికారి, కార్యదర్శి బి. రాజు, సీనియర్ రాష్ట్ర మాజీ బాధ్యుడు బండి నరసింహారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు వీవీ రామారావు, జీఎస్ఆర్ రమేష, నిర్మలాకుమారి, కోశాధికారి రాంబాబు, ఉపాధ్యక్షులు బి .వెంకన్న, షమీ, ఎస్‌కే రంజాన్, ఉద్దండు, సుధాకర్, సత్తుపల్లి మండల అధ్యక్షకార్యదర్శులు చెరుకు శ్రీనివాసరావు, కొక్కెరగడ్డ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లు కేటాయించండి

- గతంలో ఇచ్చిన హామీని మరిచారు
- ఇళ్లను తొలగించి డబుల్‌బెడ్‌రూంలు కట్టారు
- వంటావార్పుతో నిరసన నిర్వహిస్తున్న 16 కుటుంబాలు


ఇళ్ల కోసం ఆందోళన నిర్వహిస్తున్న బాధితులు

భద్రాచలం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): 'గతంలో ఇందిరమ్మ ఇళ్లను మాకు కేటాయించగా వాటిని తొలగించి డబుల్‌బెడ్‌రూంలు నిర్మించారు.. ఆ సమయంలో మాకు డబుల్‌బెడ్‌రూములు కేటాయిస్తామని ఇచ్చిన హామీ మరిచారు. ఇప్పటికైనా అధికారులు మాకు డబుల్‌బెడ్‌రూం కేటాయించాలి..' అంటూ భద్రాచలంలోని మనుబోతుల చెరువు ప్రాంతంలోని 16 కుటుంబాలు వంటావార్పుతో నిరసనకు దిగాయి. శనివారం అధికారులు కేటాయించిన డబుల్‌బెడ్‌రూముల్లో గతంలో తమకు కేటాయిస్తామన్నహామీని మరిచి రిక్తహస్తం చూపారని బాధితులు ఆరోపిస్తున్నారు. నిరుపేదల కుటుంబాలకు చెందిన తమకు గతంలోనే ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను కేటాయించగా డబుల్‌బెడ్‌రూంల నిర్మాణం కోసం తమ ఇళ్లను తొలగించారని వారు వాపోతున్నారు. నూతనంగా నిర్మించే ఇళ్లు తప్పక కేటాయిస్తామన్న హామీతోనే గతంలో నిర్మించిన ఇళ్లను తొలగించారని వారు స్పష్టంచేశారు. ఈ విషయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆందోళనలో ఇళ్లు కోల్పోయిన బాధితులు బంటు రామకృష్ణ, తోట కళావతి, ఎస్కే ఇమాంబీ, షేక్ ఆలీమా, బాసిపోయిన సావిత్రి, తిరువీధుల లక్ష్మి, కొత్తపల్లి సావిత్రి, గొల్ల వెంకట లక్ష్మి, వెట్టి చిలకమ్మా, గోల వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.


భారీగా ఉన్న సొరకాయ

బాహుబలి సొరకాయ..

ఖమ్మంటౌన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సొరకాయంటే కేజీ లేదా రెండు కేజీల చిన్నవే ఇప్పుడు మార్కెట్‌లోకి వస్తున్నాయి. కానీ ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన సేంద్రియ వ్యవసాయ సాగుపై నిర్వహించిన సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్‌కు నేలకొండపల్లి మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన బొమ్మిశెట్టి శ్రీనివాసరావు అనే సేంద్రియ సాగురైతు తాను పండిస్తున్న సొరకాయలను ప్రదర్శనకు తెచ్చారు. అవి ఒక్కోటి 6కిలోల నుంచి 8కిలోల బరువున్నాయి. సేంద్రియ సాగు చేస్తున్న రైతు బొమ్మిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ పెద్దగా ఉన్న సొరకాయలు దేశవాళీ నాటు రకమని తెలిపారు. పురాతన విత్తనాలను సేకరించి తాను కూరగాయలు పండించి, వాటినుంచి కూడా విత్తనాలు ఉత్పత్తి చేస్తానని అన్నారు.

ఉమ్మడి జిల్లాలో గ్రూప్-2 పరీక్ష ప్రశాంతం

- ఒక నిమిషం నిబంధనతో ఇబ్బందులు
- ఇరుజిల్లాల్లో సగానికన్నా తక్కువగా హాజరైన అభ్యర్థులు


అభ్యర్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

ఖమ్మం కలెక్టరేట్/ కొత్తగూడెం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్ -2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, రెండో విడతలో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయత్రం 5.30గంటల వరకు రెండు సెషన్లలోనూ పరీక్షలు సజావుగా నిర్వహించారు. అధికారులు తీసుకున్న అన్ని ముందస్తు చర్యలతో ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగలేదు. ఖమ్మం జిల్లాలో మొత్తం 27వేల 952 మంది అభ్యర్థుల కోసం 85 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పాత కలెక్టరేట్‌లో స్ట్రాంగ్ రూంలో ఉంచిన ప్రశ్నపత్రాలను ప్రత్యేక బస్సుల ద్వారా రూట్ ఆఫీసర్లు ఉదయం 8గంటలకే బందోబస్తుతో కేంద్రాలకు తీసుకొచ్చారు. నిమిషం నిబంధనను కచ్చితంగా పాటించారు. ఖమ్మంలోని ఎస్సార్‌బీజీఎన్నార్, పీజీ డిగ్రీ కళాశాల, నయాబజార్ కళాశాల కేంద్రాలకు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను లోనికి అనుమతించలేదు. వాపోయారు. ఉదయం పరీక్షలకు 27952 మందికి గాను 13,400 మంది మాత్రమే హాజరయ్యారు. ఉదయం పరీక్షకు 48శాతం, రెండో సెషన్‌కు 45శాతం మంది మాత్రమే హాజరయ్యారు.

భద్రాద్రి జిల్లాలోనూ...

భద్రాద్రి జిల్లా కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో 38పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 13,466మంది అభ్యర్థులకు గాను ఉదయం పేపర్-1కు 6,324మంది హాజరుకాగా.. 7,142మంది గైర్హాజరయ్యారు. సాయంత్రం 3గంటల నుంచి 5:30గంటల వరకు జరిగిన పేపర్-2 పరీక్షలకు 6,248మంది అభ్యర్థులు హాజరు కాగా.. 7,218మంది గైర్హాజరయ్యారు. నిమిషం నిబంధనతో ఆలస్యంగా వచ్చిన వారిని అనుమతించలేదు. పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ జితేష్ వీ పాటిల్ పరిశీలించి, పరీక్ష నిర్వాహక అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొత్తగూడెంలోని సింగరేణి ఉమెన్స్ కళాశాల, పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలను ఎస్పీ రోహిత్ రాజ్ పరిశీలించారు.

తెలుగు సాహిత్యంలో కవిత్వానికి, కథలకు విశిష్ట స్థానం

- ఘనంగా ఖమ్మం ఈస్థటిక్ సాహిత్య పురస్కారాలు


మాట్లాడుతున్న ఓల్గా

ఖమ్మం ఖానాపురంహవేలి డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో కవిత్వానికి, కథలకు విశిష్ట స్థానం ఉందని, దానిని కొనసాగించేందుకు కవులను ప్రోత్సహించేందుకు ఖమ్మం ఈస్థటిక్స్ వారు నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా, ప్రముఖ కవులు అక్కినేని కుటుంబరావు, ఎల్ఎస్ఆర్ ప్రసాద్, ఉషా తెలిపారు. నగరంలోని డీపీఇఆర్‌సీ భవన్‌లో ఆదివారం కవి రవిమారుత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈస్థటిక్ సాహిత్య పురస్కారాల సభలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా రవిమారుత్ మాట్లాడుతూ సాహిత్య పోటీలకు కథలను కవిత్వ సంపుటాలను ఆహ్వానించగానే స్పందించిన తెలుగు కవులకు కృతజ్ఞతలు తెలిపారు. 120కి పైగా కవితా సంపుటులు, 140కి పైగా కథలు వచ్చాయని, కమిటీ అభ్యర్థన మేరకు కవిత్వానికి ముగ్గురు, కథలకు ముగ్గురు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారని తెలిపారు. కవిత్వం విభాగంలో జూకంటి జగన్నాథం కవితా సంపుటి 'ఒక కప్పుచాయ్ నాలుగు మెసేజ్‌లు'కు రూ.40వేల బహుమతి, మరో ఇద్దరికి ప్రత్యేక ప్రశంశా ప్రోత్సహక అవార్డులు అందించాలని కమిటీ నిర్ణయించిందన్నారు. రాళ్లబండి శశిశ్రీ కవితా సంపుటి 'అనుముద్రం', తెలుగు వెంకటేష్ కవితా సంపుటి 'కబోధి చేపలకబుర్లు' ప్రత్యేక ప్రశంశా అవార్డుగా ఎంపిక చేశారు. ప్రముఖ కవి ఎన్. గోపి కవితా సంపుటి 'క్రియ ఒక జీవన లయ' విశిష్ట పురస్కారానికి ఎంపికైంది. కథల విభాగంలో ఉత్తమ కథగా కేవీ మనోసీత్ 'నూరేళ్లమోసే తల్లికథ' రూ.25వేల బహుమతిని గెలుచుకుంది. ద్వితీయ కథగా సయ్యద్‌గఫార్ 'న్యూ బాబాయిజం' రూ.15వేల బహుమతి పొందింది. తృతీయ ఉత్తమ కథగా 'కరీం ఝూజా' రూ.10వేల బహుమతి గెలుచుకుంది. బహుమతులు గెలుచుకున్న కథలతో పాటు పోటీకి వచ్చిన కథల్లో పన్నెండు కథలను ఒక సంపుటిగా ప్రచురించాలని కమిటీ నిర్ణయించింది. న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన ఆరుగురికి ఈస్థటిక్స్ కమిటి సభ్యులు రవిమారుత్, ప్రసేన్, సీతారాం, వంశీకృష్ణ, మువ్వా శ్రీనివాసరావు, పగిడిపట్టి వెంకటేశ్వర్లు, ఫణిమాధవి, ముఖ్య అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. విజేతలకు నగుద బహుమతితో పాటు జ్ఞాపికలు అందించారు.

ఘనంగా ముగిసిన కథాంతరంగం

ఈస్థటిక్స్ స్పేస్ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో నిర్వహించిన కథాంతరంగం కార్యక్రమం ఆదివారం ఘనంగా ముగిసింది. నగరంలోని కొత్త కలెక్టరేట్ ఎదురుగా ఉన్న సెడార్‌వ్యాలీ స్కూల్‌లో శని, ఆదివారాల్లో రెండు రోజులపాటు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలనుంచి కథా రచయతలు హాజరై క్లాసిక్ కథలపై చర్చించారు. పాతికమంది రచయతలను బృందాలుగా విభజించి చర్చలు నిర్వహించారు. నాలుగు బృందాలు జరిపిన చర్చలు, విశ్లేషణలపై పలువురు సాహితీ వేత్తలు సమన్వయకర్తలుగా వ్యవహరించి విశ్లేషణల్లోని లోటు పాట్లను వివరించారు.


హాజరైన రచయితలు

భూమిని కాపాడుకుందాం

(5వ పేజీ తరువాయి)


సేంద్రియ సాగు ద్వారా పండించిన పంటల స్టాల్స్

సారం కోల్పోయిన భూమిని తాను తీసుకొని ఎస్ఆర్‌కే పద్ధతిలో ఎంతో సారవంతంగా మార్చామన్నారు. సేంద్రియ ఎరువులతో వివిధ రకాల పంటలు పండిస్తున్నానని విజయరామ్ తెలిపారు. వ్యవసాయంపై యువరైతులు మక్కువ పెంచుకుంటేనే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందన్నారు. చేతులారా మనమే మన ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నామని, రైతులు బృందంగా ఏర్పడి, ఎస్ఆర్‌కే విధానంలో సాంద్రియసాగు చేస్తున్నవారి పొలాలను పరిశీలించాలని కోరారు. వారు చేసే వ్యవసాయ విధానాన్ని తెలుసుకుంటే ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోగలుగుతామన్నారు. తద్వారా అధిక ఆదాయంతో పాటు, ఆరోగ్యవంతంగా ఉండవచ్చన్నారు. యువ రైతులు సేంద్రియసాగుపై ఆసక్తి చూపేందుకు ఫిబ్రవరి 15నుంచి 24వరకు హైదరాబాద్‌లో సుభాష్‌పాలేకర్ స్వయంగా 10వేలమంది యువరైతులకు శిక్షణ ఇస్తారని, ఈ అవకాశాన్ని యువరైతులు వినియెగించుకోవాలన్నారు.

విజయరామ్ స్ఫూర్తితో సేంద్రియ సాగు చేసి ఎంతో లాభ పడ్డామని పలువురు రైతులు పేర్కొన్నారు. ఈ సదస్సులో పాల్గొన్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్ తన అనుభవాలను రైతులకు వివరించారు. కరోనా సమయంలో విజయరామ్ వీడియోలు చూసి, వికారాబాద్ వెళ్లి ఆయనను కలుసుకున్నానన్నారు. వారి సలహాల ద్వారా తమ పంటపొలాల్లో పామాయిల్‌తో పాటు వక్క, కోక్, కొబ్బరి పంటలను సాగు చేస్తూ ఎకరానికి రూ.3లక్షలు ఆదాయం పొందుతున్నానన్నారు. ఆర్గానిక్ పంటల విలువ తనకు తెలిసిందన్నారు. బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, డాక్టర్ చల్లా నాగేశ్వరరావు, కుతుంబాక మాధవి, అరుణ తదితర రైతుల ఎస్ఆర్‌కే పద్ధతిలో తాము చేస్తున్న సేంద్రియసాగును వివరించారు. రైతుబంధు రాష్ట్రసమితి నాయకులు నల్లమల వేంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో జిల్లా రైతుసంఘం నాయకురాలు మాదినేని లక్ష్మి, రైతు సహాయ వేదిక వ్యవస్థాపకులు నరేంద్ర స్వరూప్, సేంద్రియ సాగురైతులు వెంకట రామిరెడ్డి, రమేష్, చెరుగూరి రామారావు, రాణాప్రతాప్, అనుముల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సేంద్రియ పంటల స్టాల్స్ పలువురిని ఆకట్టుకున్నాయి.

రామయ్య సన్నిధిలో కృత్తికా దీపోత్సవం

- ఉత్సవమూర్తులకు సహస్రధారాభిషేకం


కృత్తికా దీపోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీ వైష్ణవ సంప్రదాయానుసారం కృత్తికా దీపోత్సవాన్ని ఆదివారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. ఈ ఉత్సవం అగ్నిదేవునికి ప్రీతికరమైంది. దేశంలోని సమస్త ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని, విపత్తులు తొలగాలని ఈ కృత్తికా దీపోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం రాత్రి ఐదు ప్రమిదల్లో(పాలికలు) దీపాలను వెలిగించారు. ప్రతిఏటా కృత్తికా దీపోత్సవం పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ముందుగా శ్రీ సీతారామచంద్రస్వామికి నిత్య కల్యాణమండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భద్రాచలం ఇన్‌చార్జ్ ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ సంజీవరావు, ఎస్ఐలు మధుప్రసాద్, పీవీఎన్‌రావు, విజయలక్ష్మిలు కుటుంబ సమేతంగా దీపోత్సవంలో దీపాలను వెలిగించారు. అనంతరం శ్రీ సీతారామచంద్రస్వామిని తిరువీధిసేవకు నిర్వహించగా ఈ సమయంలో చొక్కాసుర దహనం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో దేవస్థానం పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, దేవస్థానం ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, కోటి రామస్వరూప్ రాఘవాచార్య, ఉప ప్రధాన అర్చకులు అమరవాది శ్రీనివాస రామానుజం, అర్చకులు అమరవాది వెంకట్రామన్, స్థానాచార్యుడు కేయి స్థలశాయి, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతి నుంచి రైతు భరోసా

(5వ పేజీ తరువాయి)

వరంగల్‌లో విమానాశ్రయాలు ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. రాష్ట్రంలో భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీలకు రెండు విడుతలుగా ఏడాదికి రూ.12వేలు పంపిణీ చేయబోతున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినమైన డిసెంబరు 28న ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామని తెలిపారు. వచ్చే సంక్రాంతినుంచి రైతులకు రైతుభరోసా అందిస్తామన్నారు. హైదరాబాద్‌లో ఫ్యూచర్‌సిటీ, త్రిపుల్ ఆర్ రింగ్‌రోడ్, స్కిల్‌యూనివర్శిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ. మూసీనది ప్రక్షాళన, ఇండస్ట్రియల్ హౌజింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. విలేకరుల సమావేశంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు దాటుతున్న సన్నధాన్యం

(5వ పేజీ తరువాయి)

పట్టించుకోకుండా ఆదివారం రైతులు అడ్డుకోగానే చెక్‌పోస్టులో సిబ్బంది సెస్(పన్ను) వసూలు చేస్తున్నారని రైతులు తెలిపారు. తెలంగాణలో పండించిన ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయకుండా ఆంధ్రా నుంచి వస్తున్న ధాన్యాన్ని ఎలా కొనుగోలు చేస్తున్నారని దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని తమను ఆదుకోవాలని తెలంగాణ రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఖమ్మం జిల్లా సివిల్‌సప్లయిస్ అధికారి చందన్‌కుమార్, తహసీల్దార్ సునీతా ఎల్జిబెత్ చెక్‌పోస్టును పరిశీలించారు. అప్పటికే చెక్‌పోస్టు సిబ్బంది 60లారీలకు చలానా తీసుకొని పంపించగా ఆ తరువాత వచ్చిన 31 లారీలను వెనక్కి పంపించారు. ఆంధ్రా నుంచి వచ్చే ధాన్యం లారీలను అనుమతించొద్దని మార్కెట్, పోలీసు సిబ్బందిని ఆదేశించారు.

ముదిగొండ మండలం వల్లభి ద్వారా తెలంగాణలోకి అక్రమంగా ప్రవేశిస్తున్న ధాన్యం లారీలను ఆదివారం నేలకొండపల్లి మండలం చెర్వుమాధారంలో రైతులు అడ్డుకున్నారు. సుమారు 20లారీలను రైతులు అడ్డగించి నిలిపేశారు. లారీల డ్రైవర్లతో వాగ్వాదానికి దిగారు. ఆంధ్రా ధాన్యం తెలంగాణాలోకి ఎందుకు తెస్తున్నారని ప్రశ్నించారు. సమాచారం అందుకున్న నేలకొండపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లారీ డ్రైవర్ల వద్ద ఉన్న పత్రాలను పరిశీలించారు. తరువాత ఆ లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అధికారులతో మాట్లాడిన అనంతరం లారీకి రూ.3వేలు ఫైన్ వేసి, మళ్లీ రావద్దని హెచ్చరించి వదిలేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇకనైనా ఏపీ నుంచి అక్రమంగా వచ్చే సన్న రకం ధాన్యాన్ని అడ్డుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



రంగస్థల దీపస్తంభం

- కళామతల్లి సేవలో తరిస్తున్న పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్
- ఐదు దశాబ్దాలుగా కళారంగానికి సేవలు
- ఎందరో కళాకారులకు, కళాప్రదర్శనలకు మార్గదర్శకం
- కళాకారుల సమాఖ్యతో పాటు రాజకీయాల్లో నాయకత్వం
- 80 ఏళ్ల వయసులోనూ ఏమాత్రం తగ్గని కళాతృష్ణ

మధిరటౌన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మధిర అంటేనే కళలకు, కళాకారులకు పుట్టినిల్లు. అటువంటి కళాభిమానులు ఉన్న ప్రాంతంలో కళాకారులతో పాటు కళాప్రదర్శనలు అంటే టక్కున గుర్తొచ్చే పేరు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్. ఐదు దశాబ్దాలుగా అనేక పౌరాణిక, సాంఘిక నాటక కళా ప్రదర్శనలతో అటు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఎందరో యువ కళాకారులకు మార్గదర్శిగా సలహాలు, సూచనలు అందజేస్తున్నారు. మరుగున పడుతున్న కళలను బతికించేందుకు 80 సంవత్సరాల వయస్సులోను ఆయన పడుతున్న తపన అనిర్వచనీయం.

శ్రీ కృష్ణపాండవీయంలో దుర్యోధనుడి పాత్రతో పాటు బాల నాగమ్మ నాటకంలో జంగమదేవర పాత్ర భక్తకన్నప్ప నాటకంలో కోయదొర పాత్రతో పాటు అనేక పౌరాణిక నాటకాల్లో రాష్ట్ర స్థాయిలో కృష్ణప్రసాద్ తన ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అనేక మంది మధిరకు చెందిన కళాకారులతో అనేక పాత్రల్లో అభినయింప చేసి మధిర పేరును అనేక వేదికలపై వినపడేలా చేశారు.

రాజకీయాల్లో కూడా...

కళారంగంతో పాటు రాజకీయ రంగంలోనూ ఆయన రాణించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తరువాత ఖమ్మం జిల్లాకు మొట్టమొదటి అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన సేవలను గుర్తించిన అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఆయనను 1989లో మాంసం, కోళ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా, 1995లో రాష్ట్ర పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు.

పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్ రంగస్థల కళాకారుల సమాఖ్య మధిర అధ్యక్షుడిగా, రామభక్త సీతయ్య కళాపరిషత్ అధ్యక్షుడిగా, మధిర బస్సు, రైలు ప్రయాణికుల సంఘం అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు. మధిర అంటే కృష్ణప్రసాద్, కృష్ణప్రసాద్ అంటే పౌరాణిక నాటకాలకు ఖేరాఫ్‌గా ఆయన కళామతల్లి సేవలో తరిస్తున్నారు. ఇప్పటికీ ఎక్కడ పౌరాణిక నాటకాలు జరుగుతున్నా మధిర పేరు ఆ వేదికలపై వినపడేలా ఆయన చేస్తున్న కృషి అభినందనీయం.



నాటకాలకు ఆదరణ కరువైంది..
పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్



సమాజంలో నాటకాలకు ఆదరణ లేదు. ఒకప్పుడు మా నాటకాలు, నాటికలు చూసేందుకు జనాలు ఎగబడే వారు. పుర ప్రముఖులు, కళాభిమానులు ఎంతో ప్రోత్సహించేవారు. ప్రభుత్వం అంతరించిపోతున్న ఈ కళను బతికించేందుకు కళాకారులను ప్రోత్సహించాలి. ప్రభుత్వం నిర్వహించే వేడుకలలో పౌరాణిక నాటికలు ప్రదర్శించేలా చూడాలి.

క్రైం సమాచారం

సెల్ టవర్ పేరుతో సైబర్ మోసం..

- రూ. లక్ష మోసపోయిన గాంధీనగర్ వాసి

చింతకాని, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో ఖమ్మం జిల్లా చింతకాని మండల కేంద్రానికి చెందిన చెన్నూరి నాగాచారి రూ.29,700 కోల్పోయి ఒక్క రోజు గడవక ముందే గాంధీనగర్ గ్రామానికి చెందిన మరో వ్యక్తి సైబర్ నేరగాళ్ల చేతిలో రూ.1,07,240 మోసపోయినట్లు పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. గాంధీనగర్ గ్రామానికి చెందిన షేక్ మదార్‌సాహెబ్ సెల్‌ఫోన్ చూస్తుండగా నూతన సెల్ టవర్ ఏర్పాటుకు చెందిన ఒక మెసేజ్ వచ్చింది. దాని ప్రకారం మెసేజ్ ఓపెన్ చేసి నూతన సెల్ టవర్ ఏర్పాటుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేశాడు. అడ్మిషన్, డిపాజిట్, బీమా, సెక్యూరిటీ, గ్యారెంటీలు అంటూ... ఇలా విడతల వారీగా రూ 1,07,240లను ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేశాడు. ఇంకా డబ్బులు పంపమని అవతల వ్యక్తులు డిమాండ్ చేస్తుండటంతో అనుమానం వచ్చి గట్టిగా ఫోన్‌లో నిలదీయడంతో... వారు సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. మోసపోయినట్లు గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో హమాలికి గాయాలు..

జూలూరుపాడు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): జూలూరుపాడులోని ఉపమార్కెట్ యార్డు సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో హమాలికి తీవ్ర గాయాలయ్యాయి. జూలూరుపాడు పంచాయతీ పరిధిలోని న్యూకాలనికి చెందిన కాశిమల్ల శంకర్ హమాలి సైకిల్‌పై ఉపమార్కెట్ యార్డు వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో జూలూరుపాడు వైపు నుంచి ఏన్కూరు వైపు వెళ్తున్న ద్విచక్రవాహనదారుడు ముందు వెళ్తున్న సైకిల్‌ను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో శంకర్ తలకు, కాలుకు గాయాలయ్యాయి. అతణ్ని జూలూరుపాడులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్సను అందించి మెరుగైన వైద్యసేవలను అందించేందుకు ప్రైవేట్ వాహనంలో కొత్తగూడెం తరలించారు.

రూ.3 లక్షల విలువైన గంజాయి పట్టివేత

భద్రాచలం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఆదివారం ఎక్సైజు ఎన్‌ఫోర్సుమెంటు ఖమ్మం అధికారుల బృందం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా రూ.3 లక్షల విలువైన 4.730 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం పట్టుకున్నారు. వెట్టి కేశ, మడ్కం ముయ్య అనే వ్యక్తులను అరెస్టు చేయడంతో పాటు ఒక ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజు అధికారులు రమేష్, బాలు తెలిపారు. ఈ దాడుల్లో సుధీర్ , వెంకట్, విజయ్ పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

తల్లాడ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం రామానుజవరం గ్రామసమీపంలోని పొలాల్లో ఆదివారం పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్ఐ బి.కొండల్‌రావు సిబ్బందితో కలిసి దాడి చేసి ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్దనుంచి రూ.12వేల నగదు, మూడు ద్విచక్రవాహనాలు, ఒకఆటోను స్వాధీనం చేసుకున్నారు.

హోల్‌సేల్ మార్కెట్‌లో అగ్నిప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం కాయగూరలు హోల్‌సేల్ మార్కెట్‌లో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. మునిసిపాలిటీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ మార్కెట్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తోనే ప్రమాదం జరిగినట్లు సమాచారం. సమాచారం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఇల్లెందు, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఇల్లెందు పట్టణానికి చెందిన రాధాకృష్ణ(40) ద్విచక్రవాహనం మీద వెళుతున్నాడు. మార్గమధ్యలో అదుపు తప్పి చెట్టుకు ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. ఇల్లెందు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్రాంతి ఉద్యోగి ...



కల్లూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో ఇటీవల జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడిన విశ్రాంతి ఉద్యోగి కొదమసిహం రాఘవచార్యులు(75) చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. కల్లూరు చెందిన విశ్రాంత ఉద్యోగి కొదమసింహం రాఘవచార్యులు ద్విచక్రవానంపై గత శుక్రవారం స్టేట్ హైవే రహదారిపై నుంచి తన ఇంటికి వెళ్లుతుండగా రోడ్డుప్రమాదానికి గురి కాగా తలకు బలమైన గాయమైంది. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రవైట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఉదయం 10 గంటలకు మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

కళ్లకు గంతలతో నిరసన

- కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ఖమ్మం ఖానాపురంహవేలి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె ఐదవ రోజు కార్యాచరణలో భాగంగా ఉద్యోగులు కళ్లకు గంతలు కట్టుకుని మౌనప్రదర్శన చేశారు. ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు దీక్షా శిబిరాన్ని సందర్శించి ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. న్యాయమైన డిమాండ్ పేస్కేల్ అమలు అనేది ఆర్థిక అంశానికి సంబంధించినదని, ఈ సమస్యను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య మాట్లాడుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగులు సమస్యలను జిల్లా మంత్రులు పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబ్ పాషా, ఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, టీటీఎఫ్ నాయకులు లక్ష్మణ్ నాయక్, వీరునాయక్, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు.



కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ప్రైవేటు సేవలో జీపీ ట్రాక్టర్లు

- కాంట్రాక్టర్ పనుల్లో పంచాయతీల వాహనాలు
- కార్యదర్శుల అండదండలతోనే వినియోగం
- విచారణ నిర్వహిస్తామన్న ఎంపీడీవో



చెన్నూరులో ప్రైవేటు పనుల్లో వాటర్ ట్యాంకర్లు, ట్రాక్టర్

కల్లూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల ప్రైవేటుగా కాంట్రాక్టర్ల పనుల్లో నిబంధనలకు విరుద్ధంగా గ్రామ పంచాయతీల(జీపీ) పరిధిలో గల ట్రాక్టర్లు, ట్యాంకర్లు వినియోగిస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీల అవసరాల నిమిత్తం ప్రతీ జీపీకి ఒక ట్రాక్టర్, ట్యాంకర్‌ను అందించింది. వాటితో గ్రామ పంచాయతీలో పారిశుధ్య నిర్వహణ, రహదారుల వెంట మొక్కల పెంపకంలో వాటిని వాడాల్సి ఉంది. ఆ పనులను కూడా పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శి పర్యవేక్షణల వినియోగించాలి.

ప్రస్తుతం సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయినందున ట్రాక్టర్లు, ట్యాంకర్లను కార్యదర్శులు పర్యవేక్షించాల్సి ఉంది. అయితే అందుకు భిన్నంగా గ్రామ కార్యదర్శులు తమ ఇష్టారాజ్యంగా ట్రాక్టర్లు వినియోగిస్తున్నట్లు తెలిసింది. నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీల టాక్టర్లును ప్రైవేటు పనులకు ఎట్టిపరిస్థితుల్లోనూ వినియోగించకూడదు. అయినప్పటికీ మండల స్థాయిలో అధికారుల అనుమతి లేకుండా పంచాయతీల కార్యదర్శులు కాసులకు కక్కుర్తి పడి తమ ఇష్టారాజ్యంగా కాంట్రాక్టర్లకు వారి పనుల కోసం ట్రాక్టర్లను ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇక కాంట్రాక్టర్లు కూడా రాజకీయంగా అధికార అండదండలు బాగానే ఉండటంతో తమకు ఇక ఎవరూ అడ్డులేరని ఇష్టారాజ్యంగా సొంతపనులకు ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. కార్యదర్శులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని పలు గ్రామాల ప్రజలు, అధికార, ప్రతిపక్ష రాజకీయ నాయకులు ఆరోపిస్తున్నారు.

ఇలా చెన్నూరు గ్రామంలో ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు తమ సొంత కాంట్రాక్టు పనులకు సంబంధించి చెన్నూరులోని ఒక ట్రాక్టర్, ట్యాంకర్‌తో పాటుగా, యజ్ఞనారాయణపురం గ్రామ పంచాయతీకి చెందిన ట్యాంకర్‌ను కూడా తెప్పించి ప్రైవేటు పనుల్లో వాడటంపై విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా గ్రామ పంచాయతీ సిబ్బందిని కూడా ఆయా పనుల్లో వినియోగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత వారం రోజుల క్రితం నుంచి వాటిని వాడుతున్నట్లు తెలిసింది. వాస్తవంగా గ్రామ పంచాయతీల పరిధిలో ట్రాక్టర్లను ప్రజా అవసరాల నిమిత్తం మాత్రమే వాడాల్సి ఉంది. అందుకు భిన్నంగా గ్రామ పంచాయతీల ట్రాక్టర్లు, ట్యాంకర్లు వినియోగిస్తున్నప్పటికీ మండల స్థాయి అధికారుల దృష్టికి కూడా రాకపోవటం వారి పర్యవేక్షణ లేమికి నిదర్శనంగా చెప్పవచ్చు.

ప్రైవేటు పనుల్లో ట్రాక్టర్లు వాడొద్దు...
చంద్రశేఖర్, ఎంపీడీవో

గ్రామ పంచాయతీల ట్రాక్టర్లను ప్రైవేటు పనుల్లో వినియోగించటం నిబంధనలకు విరుద్ధం. ప్రైవేటు పనుల్లో పంచాయతీ ట్రాక్టర్లు వాడకంపై విచారణ నిర్వహిస్తాం. అధికారికంగా సమాచారం సేకరించి తగిన చర్యలు తీసుకుంటాం. ఎంతటి వారైనా ప్రభుత్వ వాహనాలను వినియోగిస్తే చర్యలు తప్పవు.

పెండింగ్‌లో కోర్టు కేసులు

- సింగరేణిలో ఏర్పాటు కాని లా స్టాండింగ్ కౌన్సిల్
- ఇంటర్వ్యూలు పూర్తయినా ప్రకటించని ఫలితాలు



రుద్రంపూర్, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో లా స్టాండింగ్ కౌన్సిల్ ఏర్పాటు కాకపోవడంతో కేసులు ముందుకు సాగటం లేదు. సింగరేణి కొత్తగూడెం రీజియన్ పరిధిలోని స్టాండింగ్ కౌన్సిల్ గత ఆగస్టు నుంచి లేకపోవడంతో కార్మికుల కోర్టు కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయి. కొత్తగూడెం రీజియన్‌కు సంబంధించి స్టాండింగ్ కౌన్సిల్ కోసం నోటిఫికేషన్ జారీ చేయడంతో 13మంది సీనియర్ న్యాయవాదులు దరఖాస్తులు చేసుకున్నారు. గత నవంబరు నెలలో ఇంటర్వ్యూలు నిర్వహించినప్పటికి ఫలితాలు మాత్రం వెల్లడించేందుకు యాజమాన్యం ముందుకు రాకపోవడంతో కేసులన్నీ ఎక్కడి అక్కడే నిలిచిపోతున్నాయి. కొత్తగూడెం రీజియన్ పరిధిలోని ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం ఏరియాలకు సంబంధించి స్టాండింగ్ కౌన్సిల్ కొనసాగుతోంది. కౌన్సిల్‌లో ఉన్న న్యాయవాదికి గౌరవవేతనం రూ.10 వేల వేతనం ఇస్తుండగా ఒక్కొక్క కేసుకు రూ.15వేలు చెల్లించేవిధంగా యాజమాన్యం స్టాండింగ్ కౌన్సిల్‌ను ఎంపిక చేస్తోంది. స్టాండింగ్ కౌన్సిల్ కోసం కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు ఏరియాలకు చెందిన సీనియర్ న్యాయవాదులు పోటీ పడటం, పెద్ద ఎత్తున పైరవీలు కొనసాగుతుండటంతో యాజమాన్యం స్టాండింగ్ కౌన్సిల్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఫలితాలను నిలిపివేసింది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల నుంచి యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చేందుకు న్యాయవాదులు పోటీపడుతున్నారనే ప్రచారం సాగుతోంది. సింగరేణి కార్మికులకు సంబంధించిన పదోన్నతులు, ఇంక్రిమెంట్లు, గ్రాడ్యూటీ ఇతర లావాదేవీలకు సంబంధించి కోర్టు కేసులను పరిష్కరించేందుకు సింగరేణి యాజమాన్యం స్టాండింగ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసింది. జూలై నెలలో స్టాండింగ్ కౌన్సిల్‌సభ్యుడి ఉన్న వట్టికొండ సురేష్‌బాబు మృతి చెందడంతో పోస్టు ఖాళీ అయింది. దీంతో స్టాండింగ్‌కౌన్సిల్‌ను సొంతం చేసుకునేందుకు సీనియర్ న్యాయవాదులు తమ పలుకుబడిని ఉపయోగించి యాజమాన్యంపై ఒత్తిడి తెస్తుండటంతో కౌన్సిల్ నియామకం వాయిదాపడింది. కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని కార్మికసంఘాలు యాజమాన్యాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

ఆరుబయట మంట...అవస్థల వంట

అశ్వారావుపేట రూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్యుతాపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఆరు బయటే వండుతున్నారు. దాదాపు 100 మంది వరకు ఈపాఠశాలలో విద్యార్థులు ఉన్నారు. వంట షెడ్డు పూర్తిగా శిథిల దశకు చేరుకుంది. లోపలకాని, వరండాలో కాని వంట చేసే అవకాశమే లేకుండా పోయింది. దీంతో మహిళలు ఆరుబయటే వంట చేస్తున్నారు. వర్షం వచ్చిన రోజు అయితే తాము పడే ఇబ్బందులు చెప్పలేకుండా ఉన్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో అనేక పాఠశాలల్లో ఆహారం కలుషితం అయిన ఘటనలు చూస్తునే ఉన్నాం. ఈనేపథ్యంలో పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండెందుకు వంటషెడ్డును నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఆరుబయట వంట చేస్తున్న దృశ్యం

పర్యాటకానికి జోష్..

- భద్రాద్రికి వచ్చిన పంచతంత్ర స్టూడియో, రైస్‌వాటర్ ప్రాజెక్టు..
- బృందంతో కలిసి పర్యటించిన కలెక్టర్ జితేష్ వి. పాటిల్
- స్థల పురాణాలపై ఆసక్తి చూపిన సభ్యులు
- ఆధ్యాత్మిక, పర్యాటక అంశాలపై డాక్యుమెంటరీకి చిత్రీకరణ



ఆదివాసీలతో కలిసి నృత్యం చేస్తున్న కలెక్టర్

భద్రాచలం/ పాల్వంచ రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా ఆదివారం జిల్లాలో రైస్ వాటర్ ప్రాజెక్టు, స్టూడియో పంచతంత్ర బృందాలు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి పర్యటించారు. ముందుగా వారు కిన్నెరసాని అభయారణ్యంను సందర్శించి అక్కడ పర్యాటక రంగం అభివృద్ధికి చేపడుతున్న పనులను పరిశీలించారు. కిన్నెరసాని బోట్‌లో ప్రయాణించి ఆనంద ద్వీపాన్ని సందర్శించారు. జింకల పార్కు, బాతుల పార్కును, కేటీపీఎస్ కాలువలో పుట్టి ప్రయాణాన్ని పరిశీలించారు. అనంతరం భద్రాచలంలో గోదావరి ఘాట్‌ను సందర్శించడంతో పాటు ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో చేపడుతున్న గిరిజన మ్యూజియం అభివృద్ధి పనులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. గిరిజనులు ఉపయోగించే వస్తువులు, ప్రత్యేక వంటకాల గురించి బృంద సభ్యులకు కలెక్టర్ వివరించారు. పర్ణశాల రామాలయం, నార చీరల ప్రాంతాన్ని సందర్శించి అక్కడి స్థల పురాణం, ప్రత్యేకతలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బుజ్జిగుప్ప, నారాయణరావుపేట గ్రామంలో బృంద సభ్యులు పర్యటించారు. అక్కడ పాతకాలం నాటి ఇళ్లను పరిశీలించి కోయభాష, గిరిజన సాంస్కృతిక, కొమ్ము డ్యాన్సు, వెదురుతో చేసిన కళాకృతుల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నారాయణరావుపేటలో పర్యాటక అభివృద్ధిలో భాగంగా గిరిజన సంస్కృతి సంప్రదాయాలు తెలుసుకునేందుకు వీలుగా పర్యాటకులు బస చేయడానికి వెదురుతో నిర్మిస్తున్న ఇళ్లను, కోయ సంస్కృతి సంప్రదాయాలు తెలియజేసేలా నిర్మాణాల గురించి బృంద సభ్యులకు అధికారులు వివరించారు.

ఆధ్యాత్మిక పర్యాటక రంగాలపై డాక్యుమెంటరీ..

కిన్నెరసాని, భద్రాచలం, పర్ణశాల, బొజ్జిగుప్ప తదితర ప్రాంతాల్లో పర్యటించిన పంచతంత్ర, రైస్‌వాట్ ప్రాజెక్టు బృందం పలు చోట్ల పర్యాటక ప్రాంతాల్లో ఫొటో, వీడియో చిత్రీకరణ చేశారు. వీటి సహాయంతో జిల్లా పర్యాటకానికి సంబంధించి డాక్యుమెంటరీని రూపొందించనున్నట్లు సమాచారం. ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటకం ఆధారంగా అధిక సంఖ్యలో పర్యాటకలను ఆకట్టుకునేందుకు, ఎక్కువ సంఖ్యలో పర్యాటకులను రప్పించేందుకు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్ జితేష్‌వి పాటిల్ ప్రత్యేక చొరవతో డాక్యుమెంటరీ రూపకల్పన నిర్వహిస్తున్నారు.

నేటి నుంచి ధనుర్మాస అధ్యయనోత్సవాలు

- శ్రీకృష్ణ దీక్ష స్వీకరించిన వికాసతరంగిణి సభ్యులు

పాల్వంచ టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి నవభారత్ కొండపై కొలువై ఉన్న శ్రీ వెంకటేశ్వరాలయంలో సోమవారం నుంచి ధనుర్మాస, వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కన్వీనర్ ఎంజీఎం ప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు నడాదూర్ శేషాచార్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ధనుర్మాస పూజలు డిసెంబరు 16 నుంచి జనవరి 19వ తేదీ వరకు కొనసాగుతాయని, దీనిలో భాగంగా ప్రతిరోజు ప్రత్యేక పూజలు శ్రీ గోదా కళ్యాణోత్సవం కూడా నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు ప్రతిరోజు జరిగే పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాల్సిందిగా వారు కోరారు.

శ్రీ కృష్ణ దీక్ష స్వీకరణ..

ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా చినజీయర్ స్వామి అనుగ్రహంతో కొత్తగూడెం వికాసతరంగిణి సభ్యులు నవభారత్ శ్రీ వెంకటేశ్వర ఆలయంలో ఆదివారం ధనుర్మాస శ్రీ కృష్ణ దీక్ష స్వీకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు నడాదూర్ శేషాచార్యులు పూజలు నిర్వహించి దీక్షదారులకు దీక్షను స్వీకరింపచేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరషాబు, పుల్లాచారి, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నవోదయ కాలనీ వారికి శాశ్వత హక్కులు కల్పించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): నగరంలోని వెలుగుమట్ల వినోభా నవోదయ కాలనీవాసులకు స్థలాలపై శాశ్వత హక్కులు ఇస్తూ వారికి మౌళిక వసతులు కల్పించాలని యూసీసీఆర్ఐ(ఎంఎల్) సీనియర్ నాయకుడు పగిడ ఎర్రయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బాధ్యులు కల్తి ఎర్రబాబు, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జతిన్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. వజయేందర్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం కాలనీ 6వ వార్షికోత్సవ సభలో వారు మాట్లాడారు. 2014లో భూదాన యజ్ఞబోర్డు ద్వారా ప్రొసీడింగ్స్ పొంది, 2018 నుంచి పేదలు అక్కడే నివాసం ఉంటున్నారన్నారు. ఈ సమావేశంలో దండా లింగయ్య, కల్లి రామచంద్రయ్య బాణాల లక్ష్మణాచారి, షేక్ సోంద్‌మియా, కాలనీవాసులు పాల్గొన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	24 రూ.
వంకాయ	28
గుత్తి వంకాయ	38
బీరకాయ	50
పచ్చిమిర్చి	36
కాకరకాయ	34
బెండకాయ	34
పొట్లకాయ	34
దోసకాయ	24-38
చిక్కుడు	38
నాటుచిక్కుడు	88
గోరుచిక్కుడు	40
క్యాబేజీ	24
దొండ	44-50
సొరకాయ	20
క్యారెట్	58
క్యాప్సికం	64
ఆలుగడ్డ	36
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	195
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	పుష్ప 2
శ్రీనివాస:	పని
సాయిరాం:	మిస్‌యూ
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	పుష్ప 2

డివిజన్ కార్పొరేటర్ సెల్‌నెంబర్

డివిజన్	కార్పొరేటర్	సెల్‌నెంబర్
1	తేజావత్ హుస్సేన్	98485 29188
2	మలీదు వెంకటేశ్వర్లు	99497 01116
3	మలీదు జగన్	....
4	దండా జ్యోతిరెడ్డి	98669 25591
5	పల్లెబోయిన భారతి	95538 53111
6	నాగండ్ల కోటేశ్వరరావు	90630 12222
7	దొంగల సత్యనారాయణ	81065 01875
8	లకావత్ సైదులునాయక్	98483 81719
9	షేక్ జాన్‌బీ	77996 85786
10	చావా మాధురి	80968 64444
11	సరిపూడి రమాదేవి	99482 78404
12	చిరుమామిళ్ల లక్ష్మీ	98493 29742
13	కొత్తపల్లి నీరజ	98483 16224
14	కూరాకుల వలరాజు	99498 97577
15	రావూరి కరుణ	92466 63945
16	మేడారపు వెంకటేశ్వర్లు	99126 44608
17	దనాల రాధా	95504 04444
18	మండదపు లక్ష్మీ	98480 18571
19	సీహెచ్ వెంకటనారాయణ	98485 88233
20	వీ ప్రశాంతలక్ష్మీ	98856 92345
21	ఆళ్ల నిరీశ	99487 14489
22	పల్లా రోశలీనా	76599 87283
23	షేక్ మక్బూల్	98482 38953
24	కమర్తపు మురళీ	98859 74455
25	గోళ్ల చంద్రకళ	99495 29273
26	పునుకొల్లు నీరజ	94901 45220
27	దోడ్డా నాగేశ్వరరావు	88970 28299
28	గజ్జెల లక్ష్మీ	97019 23269
29	కొప్పెర సరిత	98489 41843
30	ముక్కల కమల	98483 04794
31	యర్రా గోపీ	77020 00447
32	జోనవాస్ సరస్వతి	96764 86370
33	తోటా ఉమారాణి	99511 25339
34	రుద్రగాని శ్రీదేవి	98496 34889
35	యల్లంపల్లి వెంకట్రావు	83282 18768
36	పసుమర్తి రామోహన్‌రావు	98487 76665
37	షేక్ ఫాతిమాజోహరా	92465 55786
38	ఆలియా	98482 12872
39	మాధురి ప్రసాద్	98485 32871
40	దాడే అమృతమ్మ	96666 74646
41	కర్నాటి కృష్ణమూర్తి	99082 90555
42	పాకాలపాటి విజయనిర్మల	85001 65089
43	క్లైమెట్	98484 12449
44	పాలేపు విజయ	98669 25900
45	బుడిగెం శ్రీనివాస్	93993 70776
46	కర్నం వైష్ణవి	99668 66937
47	మాట్టేటి అరుణ	94403 58041
48	తోట గోవిందమ్మ	98480 15948
49	దుద్దుకూరి వెంకటేశ్వర్లు	98484 20471
50	రాపర్తి శరత్‌కుమార్	94940 43399
51	శీలంశెట్టి రమా	99492 28833
52	బుర్రి వెంకటేశ్వర్లు	99895 70941
53	పగడాల శ్రీవిద్య	94400 05558
54	మిక్కిలినేని మంజు	93969 66478
55	మోతారపు శ్రావణి	82975 49999
56	పగిడిపల్లి రోహిణి	98485 89580
57	మహ్మద్ రఫీదాబేగం	94901 88786
58	దోరేపల్లి శ్వేత	99639 07909
59	బట్టపోతుల లలితారాణి	81878 71700
60	బడ్డే నిరంజన్‌కుమార్	99667 72453

రాజీవ్ గృహకల్పకు పొంచి ఉన్న ప్రమాదం

- శిథిలావస్థకు చేరిన భవనాలు
- ఇప్పటికే రెండుసార్లు వరద ఉధృతితో నెర్రెలు
- మరోసారి వరద వస్తే ఉనికికే ప్రమాదం
- భయం గుప్పిట బతుకుతున్న ప్రజలు

ఖమ్మంరూరల్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు గూడు ఏర్పాటు చేయాలనే సదుద్దేశంతో 17 ఏళ్ల క్రితం ఖమ్మం రూరల్ మండలం, పోలేపల్లి రెవిన్యూ పరిధిలో రాజీవ్ గృహకల్ప భవనాలను నిర్మించారు. అనంతరం లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి ఇళ్లు కేటాయించారు. నాటి నుంచి నేటి వరకు ప్రజలు అందులోనే నివాసం ఉంటున్నారు. అయితే ప్రస్తుతం రాజీవ్ గృహకల్ప భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వరుసగా రెండుసార్లు వచ్చిన భారీ వరదలకు భవనాలు నెర్రెలు చాచాయి. మరోసారి వరద వస్తే ఈ భవనాలు కూలిపోయే ప్రమాదం ఉంది. శిథిలావస్థకు చేరిన రాజీవ్‌గృహకల్ప భవనాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

17 ఏళ్ల క్రితం నిర్మాణం

మున్నేరు పరివాహక ప్రాంతంలో 2007లో సుమారు 20 ఎకరాల్లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ గృహకల్ప భవనాలు నిర్మించింది. మొత్తం 32బ్లాకులు ఏర్పాటు చేశారు. ఒక్కోదానిలో 24ప్లాట్లు ఏర్పాటు చేశారు. మొత్తం 768 ఇళ్లు నిర్మాణం చేశారు. వాటిని లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి రూ.1.2లక్షల రుణాలు ఇప్పించి ప్రభుత్వం ఇళ్లు కేటాయించింది. 2020లో బ్యాంకులు వన్‌టైం సెటిల్‌మెంట్ అవకాశం ఇవ్వడంతో బకాయిలు చెల్లించి బ్యాంకుల వద్ద నుంచి లబ్ధిదారులు డాక్యుమెంట్లు తీసుకున్నారు.

శిథిలావస్థకు చేరిన భవనాలు

17 ఏళ్ల క్రితం నిర్మించిన రాజీవ్ గృహకల్ప భవనాలకు నేటి వరకు ఏనాడు మరమ్మతులు జోలికి వెళ్లలేదు. భవనాల మధ్యలో రావిచెట్లు మొలకెత్తుతున్నాయి. స్లాబ్‌ల నుంచి ఇనుప చువ్వలు బయటకు వస్తున్నాయి. మున్నేరు వడ్డున భవనాలు నిర్మించడంతో గత ఏడాది, ఈ ఏడాది వచ్చిన వరదలకు గృహకల్ప ప్రాంతం మొత్తం మునిగిపోయింది. వరద ఉధృతికి ప్రజలు అతలాకుతలం అయ్యారు. భవనాలు అక్కడక్కడా నెర్రెలు చాచాయి. గృహ సముదాయంలో కింద ఫ్లోర్లో ఉన్న అదనపు నిర్మాణాలు వరదలకు నేలమట్టమయ్యాయి. వందల మంది నివాసం ఉండే సముదాయం మరింత బలహీన పడితే ప్రాణనష్టం ఉంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి పెను ప్రమాదం సంభవించక ముందే ప్రస్తుత అనుభవాల నేపథ్యంలో ఇప్పటికైనా మరో చోట ఇళ్ల నిర్మాణం చేపట్టి వారిని అక్కడకు మార్చాలని గృహకల్ప వాసులు వేడుకుంటున్నారు.



రాజీవ్ గృహకల్ప భవన సముదాయం

జనరిక్ మందుల దుకాణాన్ని తెరవరూ?

- ఏడు నెలలుగా మూత
- పట్టించుకోని అధికారులు

ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతి ప్రజలు అనారోగ్యానికి గురైతే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆశ్రయిస్తుంటారు. దీంతో వీరికి తక్కువ ధరకు మందులు అందుబాటులో ఉంచాలన్న ఉద్దేశ్యంతో జిల్లా ఆస్పత్రిలో జనరిక్ ముందుల దుకాణాన్ని ఏర్పాటు చేశారు. ఇది కొద్ది రోజుల వరకు ఎందరికో ఉపయోగ పడింది. కానీ ఏడు నెలల క్రితం ఉన్న దుకాణాన్ని మూసేశారు. ఎందుకు తొలగించారన్న దానిపై అధికారుల నుంచి సమాధానం లేదు.

పేదలకు ఎంతో ఉపయోగం

జిల్లాలో అనారోగ్య బాధితులు, రోగులు ఎంతో మంది మందుల కొనుగోలుకు బయట అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. అనేక మంది పేదలు ఉపాధి లేక నెలవారీ ఖర్చులతో ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు దగ్గు, జలుబు, జ్వరం వచ్చినా మందులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. వివిధ కంపెనీలు తమ ఉత్పత్తులను అధిక ధరలకు విక్రయిస్తుండడంతో పేదలపై భారం పడుతోంది. కోవిడ్ తర్వాత మందుల వినియోగం కూడా పెరిగింది. ధరలు కూడా రెండింతలయ్యాయి. జనరిక్ మందుల దుకాణం అందుబాటులో ఉంటే పేదలకు వరంగా మారేది. ప్రధాని నరేంద్రమోదీ దేశ వ్యాప్తంగా అన్ని జిల్లా మండల కేంద్రాల్లో జనరిక్ మందుల దుకానాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఉన్న జనరిక్ మందుల దుకాణం మాత్రం తెరుచుకోవడం లేదు. అంతే కాదు ఆస్పత్రికి ఆ దుకాణం ఏర్పాటు చేస్తే అద్దె కూడా వచ్చే ఆస్కారం ఉంది. ఆ దిశగా ఆస్పత్రి అధికారులు దృష్టి సారించక పోవడం గమనార్హం. ఏడు నెలల క్రితం దీన్ని అర్ధాంతరంగా మూసేశారు. దాని నిర్వాహకులు కూడా ఆస్పత్రి అధికారుల చుట్టూ తిరిగితిరిగీ వేసారారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దుకాణాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.



జిల్లా జనరల్ ఆస్పత్రిలో మూతపడిన మందుల షాపు

జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

- ఒకే దేశం ఒకే ఎన్నిక బిల్లును రద్దు చేయాలి
- మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి

ఖమ్మంసంక్షేమవిభాగం, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికల విధానం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ విధానంతో ఎన్నికలు అధ్యక్ష తరహా విధానానికి దారితీస్తాయని, భారత రాజ్యాంగం ఫెడరల్ స్ఫూర్తిగా ఏర్పాటు జరిగిందని, ఒకే దేశం ఒకే ఎన్నిక బిల్లును కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేసుకోవాలని సూచించారు. బీజేపీ ప్రభుత్వం శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఒకే ఎన్నికబిల్లును ప్రవేశ పెట్టేందుకు ఏర్పాట్లు చేసిందని, దానిని ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా ఖండించాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా బిల్లును రూపొందించారని ఆరోపించారు. విభిన్నమైన రాజకీయ, సామాజిక ప్రాంతాలున్న భారతదేశంలో ఒకే దేశం ఒకే ఎన్నికలు సరైందికాదన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో వార్షికోత్సవం

ఖమ్మంస్పోర్ట్స్,డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): నగరంలోని కేంద్రీయ విద్యాలయ సంఘటన్ పాఠశాల 62వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు దేశంలోని వివిధ రాష్ట్రాల కళా సాంస్కృతిక సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా కళా విన్యాసాలు, నాటికలు ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

సభ్యత్వంతోనే టీడీపీ పార్టీ పునర్నిర్మాణం

- జిల్లా నాయకుడు పుచ్చకాయల

కామేపల్లి,డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): టీడీపీ పార్టీ సభ్యత్వం నమోదుతోనే పార్టీ పునర్నిర్మాణం జరుగుతుందని ఆ పార్టీ జిల్లా నాయకులు పుచ్చకాయల సత్యనారాయణ అన్నారు. ఆదివారం పింజరమడుగులో టీడీపీ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభోవం వస్తోందన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కార్యకర్తలు సహకరించాలని కోరారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి టీడీపీ పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు కార్యకర్తల కుటుంబ సంక్షేమం కోసం సభ్యత్వ నమోదు చేసి రూ.5లక్షల ప్రమాద బీమా కల్పిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పుచ్చకాయల రామక్రిష్ణ, కొండబాల శ్రీనివాసరావు, నూతలపాటి నాగేశ్వరరావు, ఏపూరి వసంతరావు, కిన్నెర రమేష్, సంపం వెంకన్న, గుజ్జర్లపుడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పింజరమడుగులో సభ్యత్వ నమోదు

జాతీయ అథ్లెటిక్స్‌లో వైశాలికి రజతం

ఖమ్మంస్పోర్ట్స్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): ఇటీవల మంచిర్యాలలో జరిగిన జాతీయస్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ పోటీలలో నగరానికి చెందిన వైశాలి సత్తా చాటి ద్వితీయ బహుమతి సాధించింది. సర్దార్ పటేల్ స్టేడియంలోమ నిత్యం సాధన చేసే వైశాలి అండర్-16 బాలికల విభాగంలో పెంటథ్లాన్ పోటీలో రజత పతకం కైవసం చేసుకుంది. జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ చూపిన ఆమెను ఆదివారం స్థానిక ఎస్పీ స్టేడియంలో డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ గౌస్, అథ్లెటిక్ సంఘం జిల్లా కార్యదర్శి షఫీక్ అహ్మద్, సంఘ సభ్యులు సుధాకర్, క్రిష్ణయ్య, రవి, నవీద్, అభినందించారు.



వైశాలిని అభినందిస్తున్న డీవైఎస్‌వో

క్రాస్‌కంట్రీ జట్టు ఎంపిక

ఖమ్మంస్పోర్ట్స్,డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): ఈనెల22న నాగర్‌కర్నూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే క్రాస్‌కంట్రీ జిల్లా జట్టును ఆదివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 22మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్-16,18,20 బాలురు, బాలికల విభాగాలతో పాటు సీనియర్ పురుషులు, మహిళలకు పరుగు పోటీలు నిర్వహించారు. బాలుర జట్టులో ఈశ్వర్, ముకేష్,అనిల్,వెంకటసాయి, విక్రమ్, గణేష్, బాలికలజట్టులో సమీన్ ఎంపికైనట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శితెలిపారు.

గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయండి

- బీజేపీ రాష్ట్ర నాయకుడు తక్కెళ్లపల్లి

నేలకొండపల్లి,డిసెంబరు15(ఆంధ్రజ్యోతి):రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని, గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయటానికి కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తక్కెళ్ళపల్లి నరేందర్‌రావు అన్నారు. పార్టీ రాష్ట్ర నాయకుడు భవనాశి దుర్గారావు ఇంట్లో ఆదివారం నిర్వహించిన బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో పాల్గొన్నారు. మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. పార్టీని బలోపతం చేయటానికి ప్రతీ కార్యకర్తా కృషి చేయాలన్నారు. మండలంలోని ప్రతిగ్రామంలో పార్టీ శాఖలను ఏర్పాటుచేయాలని, సభ్యుల సంఖ్యను పెంచాలన్నారు. నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి ప్రచారం చేయాలన్నారు కేంద్రంఅమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరకూ అందుతున్నదీ లేనిదీ కార్యకర్తలు తెలుసుకుని కేంద్ర నాయకత్వానికి సమాచారం ఇవ్వాలని సూచించారు.సమావేశంలో భవనాశి దుర్గారావు, పాగర్తి సుధాకర్, షేక్.షర్ఫుద్దీన్, బాజా రామకృష్ణ, రామాచారి,వెంకటరెడ్డిమొహినుద్దీన్ పాల్గొన్నారు.



సభ్యత్వం ఇస్తున్న నరేందర్‌రావు

బాధిత కుటుంబానికి యుగంధర్ పరామర్శ

రఘునాథపాలెం,డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలో చిమ్మపూడి, కొటపాడు, పంగిడి గ్రామాల్లో జిల్లా కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ ఆదివారం పర్యటించారు. ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. వేపకుంట్లలో అనారోగ్యంతో కన్నుమూసిన కాంగ్రెస్ నాయకుడు చౌగాని రాము(24) భౌతికకాయం వద్ద నివాళులు అర్పించారు. వాంకుడోత్ దీప్లానాయక్, ఆర్విట్ల ప్రేమ్‌కుమార్, సుధీర్, బండి నాగేశ్వరరావు, దేవ్‌సింగ్, రామునాయక్ పాల్గొన్నారు.



రాము భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న తుమ్మల యుగంధర్

28న భక్త సమ్మేళనం

సత్తుపల్లిరూరల్,డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): రామకృష్ణ-వివేకానంద భావ ప్రచార పరిషత్ 6వ భక్త సమ్మేళనాన్ని ఈనెల 28,29వ తేదీల్లో సత్తుపల్లిలో ఏర్పాటు చేసినట్లు నిర్వహకులు చీకటి శ్రీనివాసరావు, గట్టే వాసు, గార్లపాటి రామకృష్ణలు ఆదివారం తెలిపారు. శ్రీరామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో వివేకానందుని జీవిత చరిత్రపై విద్యార్థులకు అవగాహన పోటీలు నిర్వహించారు.నవంబరు 20నపాఠశాల స్థాయిలో నిర్వహించిన పోటీల విజేతలను నియోజకవర్గ స్థాయి పోటీలకు అనుమతించామని తెలిపారు. ఫైనల్ పోటీల విజేతలకు ఈనెల28న జరుగనున్న విద్యార్థి సమ్మేళనంలో బహుమతులు అందజేస్తామని చెప్పారు.

అనారోగ్యంతో కాంగ్రెస్ నాయకుడి మృతి

కొణిజర్ల, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సింగరాయపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు షేక్ చాంద్‌మియా(45) అనారోగ్యంతో శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. చాంద్‌మియా కాంగ్రెస్ అంటూ ప్రాణం తీసుకుంటాడని కరుడుకట్టిన కార్యకర్తగా అతనికి గుర్తింపు ఉందని స్థానికులు చెప్పుకుంటున్నారు. విషయం తెలసుకున్న కాంగ్రెస్ జిల్లా నాయకుడు సూరంపల్లి రామారావు ఆదివారం చాంద్‌మియా మృతదేహన్ని సందర్శించి కాంగ్రెస్ జెండా కప్పి నివాళులర్పించారు. చాంద్‌మియా వంటి నిజమైన కార్యకర్తను కోల్పోవడం పార్టీకి తీరని లోటని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, సీపీఎం, కాంగ్రెస్, ఎన్డీ నాయకులు వెంకటేశ్వర్లు, దొడ్డపునేని కృష్ణార్జునరావు, షేక్ అఫ్జల్, మిద్దె రామారావు, అనుమోలు శ్రీనివాస్ రావు, రావుల వెంకయ్య, షేక్ ఖాసీం, బాబు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల కార్యవర్గం ఎన్నిక

వైరా, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): వైరా మండల పంచాయతీ కార్మికుల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని గొల్లపూడిలో ఆదివారం జరిగిన పంచాయతీ కార్మికుల సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఆళ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా తేళ్లూరి రాజేష్, కార్యదర్శిగా కొరివి శ్రీను, కోశాధికారిగా గొర్రెముచ్చు రాకేష్, సలహాదారులుగా మహేష్, వెంకటనారాయణ, లక్ష్మాచారి, కొండల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఘనంగా దత్త జయంతి వేడుకలు

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కస్బాబజార్ శ్రీగురుపాదుకా పీఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో నవమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం శ్రీదత్తత్రేయ జయంతి నిర్వహించారు. గిరినార్ నుంచి దత్త పాదుకలు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 53వ సామూహిక శ్రీఅనఘాదేవి సమేత శ్రీదత్తాత్రేయ స్వామి అనఘాష్టమి వ్రతాలు, లక్ష్మీ గణపతి, హోమం, దత్తాత్రేయ హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఉరిమళ్ళ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. గాంధీచౌక్ శ్రీషిరిడి సాయిబాబా మందిరంలో ఆదివారం దత్త జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. 27 కళాశాలతో పంచామృత అభిషేకం గణపతిపూజ దత్తాత్రేహోమం నిర్వహించారు.



హోమం నిర్వహిస్తున్న కృష్ణప్రసాద్

కుటుంబ సభ్యుల చెంతకు వ్యక్తి

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని మతిస్థిమితం కోల్పోయి రోడ్ల వెంట తిరుగుతున్న వ్యక్తిని పోలీసుల సమాచారంతో అన్నం ఫౌండేషన్‌లో చేర్పించారు. వైద్యసేవల అనంతరం కోలుకున్న వ్యక్తి వివరాలు వెల్లడించారు. అన్నం శ్రీనివాసరావు ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ములుగు జిల్లా మంగపేట పోలీసుల సమక్షంలో కాంతరావును తండ్రి బాలయ్యకు అప్పగించారు.

టీఎన్జీవో కార్యాలయంలో సెమీ క్రిస్మస్

ఖమ్మంకలెక్టరేట్, డిసెంబర్15(ఆంధ్రజ్యోతి): టీఎన్జీవో జిల్లా కార్యాలయంలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మత పెద్దలు ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వాదాలు అందించారు. టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో టీఎన్జీవో నాయకులు కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు.ఈకార్యక్రమంలో గుంటుపల్లి శ్రీనివాస్, బుల్లెట్ శ్రీను, టీజీవో నాయకులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, సైదులు,తదితరులు పాల్గొన్నారు.



జెర్రిపోతులకు భట్టి అభినందన

నేలకొండపల్లి,డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): ఇటీవల యూత్ కాంగ్రెస్ నిర్వహించిన ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన నేలకొండపల్లికి చెందిన జెర్రిపోతుల అంజనీని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభినందించారు. యువజన కాంగ్రెస్ అభివృద్ధికి, పటిష్టానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు ఇన్‌చార్జి బచ్చలకూరి నాగరాజు, ఓబీసీసెల్ జిల్లా కార్యదర్శి బోయిన వేణులు పాల్గొన్నారు.

బోడేపూడిలో వైద్యశిబిరం



వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

వైరా, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావాలని బోడేపూడి కళానిలయ సంస్థ కార్యదర్శి బొంతు రాంబాబు, ప్రముఖ వైద్యుడు చీకటి భారవి పేర్కొన్నారు. క్రమం తప్పకుండా 114వ నెల మూడో ఆదివారం వైరాలో బోడేపూడి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వందలాదిమంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు చీకటి భారవి, పిల్లలమర్రి సుబ్బారావు వైద్యసేవలందించారు. నిర్వాహకులు, మాజీ ఎంపీపీ బొంతు సమత, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి మధిరలో ధనుర్మాసోత్సవాలు

మధిర, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మధిర వన్‌టౌన్‌లోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 16వతేదీ సోమవారం నుంచి జనవరి 13వతేదీ వరకు ధనుర్మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈసందర్భంగా ప్రతిరోజు ఉదయం 5గంటలకు సుప్రభాతసేవ, 5.30గంటల నుంచి స్వామివారికి నిత్య తిరువారాధన, ప్రత్యేక పూజలు, అష్టోత్తరం, పాశుర వివరణ, తోమాల సేవ, పురప్పట్టుసేవ, విశేషగోష్ఠి, మంగళాశాసనం, తదితర పూజలు మాసకల్యాణం నిర్వహిస్తారు. సాయంత్రం విష్ణుసహస్రనామార్చన, ఊంజలసేవ, 108 స్వర్ణ పుష్పాలతో అర్చన తదితర పూజలు పలువురు వేదపండితులు నిర్వహిస్తారని తెలిపారు. ఈనెల 31 వతేదీ నుంచి 13వతేదీ వరకు రోజుకొక విధంగా స్వామివారి ప్రత్యేక దర్శనాలు ఉంటాయని తెలిపారు. 10వతేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, 13వతేదీ గోదా-రంగనాధుల కల్యాణం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మునిసిపల్ చైర్మన్ జైపాల్

వైరా, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వైరా ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. చర్చి పాదర్ మాదాసు రాజు, సభ్యులు తప్పెట రవి, జగదీష్, శ్రీకాంత్, జోజి పాల్గొన్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు



వరి నాట్లు వేసిన దృశ్యం

వైరా, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): వైరా మండలంలో ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దాదాపు 25వేల ఎకరాల్లో రైతులు వరి సాగుచేశారు. అయితే ఈ వరిసాగుకు ఒక నిర్దిష్టమైన సమయాభావం లేకపోవడంతో ఈ రెండు సీజన్ల వ్యవసాయ పనుల్లో ఎంతో వ్యత్యాసం ఉంది. ఏర్లు, వాగులు, వ్యవసాయ కరెంట్ మోటర్ల కింద జూలైలోనే వరినాట్లు వేసిన రైతులు ఇప్పటికే వరికోసి ధాన్యాన్ని విక్రయించుకొని బోనస్‌తో సహా మొత్తం సొమ్మును పొందారు. వైరా రిజర్వాయర్ కింద ఆగస్టులో సాగుచేసిన వరిపంట ఇప్పుడిప్పుడే కోతలకు వచ్చాయి. సెప్టెంబరు చివరి వరకు సాగుచేసిన వరి కోతలకు ఇంకా నెలరోజులకు పైగా సమయం ఉంది. ఎన్నెస్పీ కాల్వల కింద కూడా ఆలస్యంగా వరి సాగుచేశారు. రిజర్వాయర్ కింద ఆగస్టు మొదట్లో వరి వేసిన రైతులు యంత్రాలతో కోసి విక్రయించేందుకు రోడ్లు, కల్లాల్లో ఆరబోశారు. ఓవైపున తుఫాన్లతో ఆకాశం మేఘావృతం అవుతుండటం మరోవైపు శీతాకాలం కావడంతో సరిగా ఎండలు లేక ఆరబోసిన ధాన్యం ఎండటం లేదు. ఫలితంగా వరి ధాన్యం తేమశాతం తగ్గి విక్రయించుకోవడానికి 15రోజులకుపైగా రైతులకు సమయం పడుతుంది. ప్రతిరోజూ ధాన్యాన్ని ఆరబెట్టడం, పోగేయడం రైతులకు భారంగా మారింది. కూలీలకు అదనంగా డబ్బు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. దాదాపు 80శాతం వరికోతలు పూర్తికావడానికి జనవరి చివరి వరకు పడుతుంది. ఇదే సమయంలో మార్చి 31వరకు రిజర్వాయర్ నుంచి నీటి విడుదలకు నిర్ణయం చేయడంతో ముందుగా వరికోసిన రైతులు రబీకి సిద్ధమవుతున్నారు. కొంతమంది రైతులు ఇప్పటికే వరినారుమళ్లు పోశారు. ముఖ్యంగా దాచాపురం, గరికపాడు, గన్నవరం, ఖానాపురం, నారపనేనిపల్లి గ్రామాల్లోని రైతులు వైరా నది, వ్యవసాయ మోటర్ల కింద రబీ సాగుకు వరినారుమళ్లు పెంచుతున్నారు. రిజర్వాయర్ కుడి కాల్వ మొదట్లో ఉన్న వైరా, బ్రాహ్మణపల్లి, గండగలపాడు, సోమవరం, ముసలిమడుగు, స్నానాల లక్ష్మీపురం రైతులు రెండురోజుల నుంచి వరి విత్తనాలు చల్లారు. ముఖ్యంగా 120రోజుల పంట కాలమైన పీఆర్126రకం వరి విత్తనాలతోపాటు ఇతర రకాల విత్తనాలను వరినార్లుగా పోశారు. మొత్తంగా ఒకవైపున మూడ్నాలుగు దశలుగా ఉన్న ఖరీఫ్ ఇప్పుడు మళ్లీ రబీ వ్యవసాయ పనుల్లో రైతాంగం క్షణం తీరిక లేకుండా నిమగ్నమై ఉన్నారు.



ధాన్యాన్ని ఒక దగ్గరికి చేర్చుతున్న రైతు



రవికుమార్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్

కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడికి ఎమ్మెల్యే అభినందన

వైరా, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): వైరా మండల కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా నియమితులైన గొండేలా రవికుమార్‌ను ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అభినందించారు. ఆదివారం ఎమ్మెల్యేను రవికుమార్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కాంగ్రెస్ పటిష్టత కోసం పనిచేయాలని రవికుమార్‌కు ఎమ్మెల్యే సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు రఘురాంరెడ్డి, రేణుకాచౌదరి నాయకత్వంలో పనిచేసి పార్టీ అభివృద్ధికి పనిచేస్తానని రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కాంగ్రెస్ నాయకులు కట్ల రంగారావు, శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, మిట్టపల్లి నాగి తదితరులు పాల్గొన్నారు.

28న వివేకానంద భావ ప్రచార పరిషత్ భక్త సమ్మేళనం

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణ-వివేకానంద భావ ప్రచార పరిషత్ 6వ భక్త సమ్మేళనాన్ని ఈనెల 28,29వ తేదీల్లో సత్తుపల్లిలో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు చీకటి శ్రీనివాసరావు, గట్టే వాసు, గార్లపాటి రామకృష్ణలు ఆదివారం తెలిపారు. శ్రీ రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో వివేకానందుని జీవితచరిత్రపై విద్యార్థులకు అవగాహన పోటీలు నిర్వహించారు. నవంబరు 20న పాఠశాల స్థాయిలో నిర్వహించిన పోటీల విజేతలను నియోజకవర్గ స్థాయి పోటీలకు అనుమతించామని తెలిపారు. ఫైనల్ పోటీల విజేతలకు ఈ నెల 28న జరగనున్న విద్యార్థి సమ్మేళనంలో బహుమతులు అందజేస్తామని చెప్పారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

అభివృద్ధికి కేరాఫ్‌గా మధిర మునిసిపాలిటీ

» ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

మధిరటౌన్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇతర మునిసిపాలిటీలకు దీటుగా మధిర మునిసిపాలిటీని అభివృద్ధికి కేరాఫ్ అడ్రెస్‌గా నిలుపుతానని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం మధిర ఆర్‌వీ కాంప్లెక్స్ సెంటర్‌లో రూ.19 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధిర పట్టణంలో నివసించే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడేలా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. భవిష్యత్తులో చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు మధిరలో స్థిరపడేందుకు ఇష్టపడేలా పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు. నాలుగు సార్లు గెలిపించిన మధిర ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, కౌన్సిలర్లు మల్లాది వాసు, యర్రగుంట లక్ష్మి, ఆర్‌అండ్‌బీ జేఈ రాంబాబు, మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్, కాంగ్రెస్ నాయకులు సూరంశెట్టి కిషోర్, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పారుపల్లి విజయ్, అనిల్, రంగా శ్రీను, కరివేద సుధాకర్ పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మధిరటౌన్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో తనను కలిసిన మధిర నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆన్‌లైన్ ఓటింగ్ ద్వారా రెండో సారి ఎన్నికైన తూమాటి నవీన్‌రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు సురేష్, రాజీవ్‌గాంధీ హన్మంతు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

పోడుభూములలో విద్యుత్ సౌకర్యానికి అనుమతివ్వాలని వినతి

మధిర రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పోడు సాగు చేసుకుంటున్న రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని, సోలార్ విద్యుత్‌కు విధివిధానాలు ప్రకటించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందజేశారు. ఆదివారం మధిరలోని క్యాంపు కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేరుగు సత్యనారాయణ, పొన్నం వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకువెళ్లారు. ఇటీవల పోడుభూముల్లో సోలార్ విద్యుత్ సరఫరాకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని సంఘం తరపున స్వాగతిస్తున్నామన్నారు. అనంతరం భట్టి మాట్లాడుతూ పోడు సాగుదారుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, తేలప్రోలు రాధాకృష్ణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని పూర్వపు వీఆర్వోలు వినతి

ముదిగొండ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వనంవారికృష్ణాపురం గ్రామంలో పర్యటించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు ఆదివారం గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమసంఘం పూర్వ వీఆర్వోలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు గరిక ఉపేంద్రరావు, బంకా కృష్ణ, నాగూల్‌మీరా, కిషోర్, వెంకటేశ్వర్లు, జానిమియా పాల్గొన్నారు.

ముదిగొండ మండలం కమలాపురానికి చెందిన కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు మట్టా బాబూరామ్‌రామిరెడ్డి కుమార్తె వివాహానికి భట్టి విక్రమార్క హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, పసుపులేటి దేవేంద్రం, మల్లెల అజయ్, రవీందర్‌రెడ్డి, వల్లూరి భద్రారెడ్డి, పళ్లపాటి కృష్ణ, ఉసికల రమేష్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో కాంగ్రెస్ నాయకుడు చాంద్‌మియా మృతి

కొణిజర్ల, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సింగరాయపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు షేక్. చాంద్‌మియా(45) అనారోగ్యంతో శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. చాంద్‌మియా కాంగ్రెస్ అంటూ ప్రాణం తీసుకుంటాడని కరుడుకట్టిన కార్యకర్తగా అతనికి గుర్తింపు ఉందని స్థానికులు చెప్పుకుంటున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా నాయకుడు సూరంపల్లి రామారావు ఆదివారం చాంద్‌మియా మృతదేహాన్ని సందర్శించి కాంగ్రెస్ జెండా కప్పి నివాళులర్పించారు. చాంద్‌మియా వంటి నిజమైన కార్యకర్తను కోల్పోవడం పార్టీకి తీరని లోటని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, దొడ్డపునేని కృష్ణార్జునరావు, షేక్ అఫ్జల్, మిద్దె రామారావు, అనుమోలు శ్రీనివాస్‌రావు, రావుల వెంకయ్య, షేక్ ఖాసీం, బాబు తదితరులు పాల్గొన్నారు.



చాంద్‌మియా మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సూరంపల్లి రామారావు

పొట్టి శ్రీరాములు ఆశయాలు సాధించాలి

మధిరటౌన్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాముల ఆశయాలు సాధించాలని పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు అన్నారు. పొట్టి శ్రీరాముల వర్ధంతిని ఆదివారం మధిరలో ఆర్యవైశ్య నాయకులు నిర్వహించారు. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కురువెళ్ల కృష్ణ, పుల్లఖండం చంద్రశేఖర్, నరసింహరావు, కృష్ణారావు, వాణి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైరా, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వైరా మండల, పట్టణ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం వైరాలో అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి వేడుకలు నిర్వహించారు. పొట్టిశ్రీరాములు విగ్రహానికి దారా వెంకటకృష్ణారావు, కొల్లా రాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జల్లా అవినాష్, చల్లా వెంకటరమణ, బొగ్గవరపు సునీత, రాయల రోజా, మిట్టపల్లి పద్మజ, అనుమోలు కుమారి, మిట్టపల్లి మంజుల, గ్రంధి లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

కల్లూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) కల్లూరులో ఆదివారం ఆర్యవైశ్య మండపం ప్రాంగణంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు ఆధ్వర్యంలో పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పూలమాలు వేసి ఘనమైన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మండపం అధ్యక్షుడు సంకా రాంబాబు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అనుమోలు శ్రీనువాసరావు, నాయకులు చలువాది నగేష్, చారుగుండ్ల అచ్యుతసీతారామారావు, గుర్రం వెంకటేశ్వరరావు, చారుగుండ్ల మురళి తదితరులు ఉన్నారు.



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్య వైశ్య సంఘం నాయకులు



కల్లూరులో..



మధిరటౌన్‌లో నివాళులర్పిస్తున్న దృశ్యం

కొణిజర్లలో ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు

కొణిజర్ల, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): రెండు రోజులు పాటు జరిగే గ్రూప్-2 పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ప్రశాంతంగా జరిగింది. మండలంలో ఏడు సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. ప్రతి సెంటర్ వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించారు. ఉదయం ఏడు సెంటర్లలో 2,376 మంది అభ్యర్థులకు గాను 1,237 మంది హాజరయ్యారు. మధ్నాహ్నం 2,376 మందికి గాను 1,214 మంది హాజరు అయ్యారు. మండలంలోని పల్లిపాడు సమీపంలో ఓ పరీక్షాకేంద్రంలో హుజూర్‌నగర్‌కు చెందిన ఓ అభ్యర్థిని పరీక్షా కేంద్రం వద్ద క్లాక్‌రూమ్ ఎందుకు ఏర్పాటు చేయలేదని, వెంట తెచ్చుకున్న బ్యాగు ఎక్కడ పెట్టాలని, తను దూరం నుంచి వస్తే కనీసం సౌకర్యాలు పరీక్షా కేంద్రంలో లేవని ఆగ్రహం వ్యక్తం చేసింది. తర్వాత సమీపంలోని ఓ ఇంటిలో పెట్టుకొని వచ్చింది. దీనిపై పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ నిబంధనలు ప్రకారం క్లాక్‌రూమ్ ఏర్పాటు ఉండదని తెలిపారు. అభ్యర్థులు అర్థం చేసుకోవాలని కోరారు. ఎవరి వస్తువులు వారే భద్రపరుచుకోవాలని తెలిపారు.



తనికెళ్ల సమీపంలో పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

పంచాయతీ కార్మికుల మండల కార్యవర్గం ఎన్నిక

వైరా, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వైరా మండల పంచాయతీ కార్మికుల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని గొల్లపూడిలో ఆదివారం జరిగిన పంచాయతీ కార్మికుల సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఆళ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా తేళ్లూరి రాజేష్, కార్యదర్శిగా కొరివి శ్రీను, కోశాధికారిగా గొర్రెముచ్చు రాకేష్, సలహాదారులుగా మహేష్, వెంకటనారాయణ, లక్ష్మాచారి, కొండల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



శ్రీనివాసరావు



రాజేష్

హామీలతోనే సరి...!

» నెరవేరని కల్లూరు మునిసిపాలిటీ కల » ముందుకు సాగని పాలకుల కార్యాచరణ

కల్లూరు, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీ (ఉన్నతిగా) మునిసిపాలిటీగా అయ్యే అవకాశం కలగానే మారింది. గత ప్రభుత్వంలో కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీ మునిసిపాలిటీగా చేసేలా నాటి పాలకులు హామీలు ఇచ్చారే కాని, అది నేటి వరకు కార్యరూపంలో ముందుకు సాగని పరిస్థితి. నేటి ప్రభుత్వ పాలకులు సైతం దృష్టి సారించని పరిస్థితి. వాస్తవంగా కల్లూరు మండలంలోనే మంత్రిగా శ్రీనివాసరెడ్డి ఉన్న ఇంత వరకు కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీని మునిసిపాలిటీగా చేసే విషయమై దృష్టి సారించని పరిస్థితి. మరోవైపున కల్లూరు పట్టణంలో అధికార పార్టీ నాయకులు ఉన్న వారు కూడా పట్టించుకోని పరిస్థితి. కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఇప్పటికే 20 వేలకు పైగా జనాభాతోపాటుగా, 16 వేలకు పైగా ఓటర్లు ఉన్నారు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దున కల్లూరు విస్తరించి ఉంది. ఇదే ప్రాంతం నుంచి పలు పట్టణ ప్రాంతాలకు నేషనల్ హైవే విస్తరించి ఉంది. ఇంకాను ఆదాయంలో కూడా అధికమించింది. తెలంగాణ రాష్ట్రంలోనే కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీ పెద్దది. వాణిజ్యపరంగా, వ్యవసాయ పరంగా కూడా ఎంతో ప్రాధాన్యత సంతరించుకోవడమే కాకుండా రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉంది. ఈ పంచాయతీ పరిధిలో శివారు గ్రామాలు ఖాన్‌ఖాన్‌పేట, శ్రీరాంపురం, గోపాలదేవబోయినపల్లి గ్రామాలు ఉండగా, సమీపంలో కిష్టయ్యబంజరు, పుల్లయ్యబంజరు, హనుమతండ, లక్ష్మాతండ, కప్పలబంధం గ్రామాలు ఉన్నాయి.

ఇన్ని అర్హతలు కలిగి ఉన్న కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీని (ఉన్నతిగా) మునిసిపాలిటీగా చేసే విషయంలో ప్రభుత్వం నేటి వరకు దృష్టి సారించక పోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మరో రెండు నెలల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిచేందుకు ప్రభుత్వం సన్నద్ధం అవుతుంది. ఈ నేపథ్యంలో కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీని మునిసిపాలిటీగా చేసే విషయంలో సత్తుపల్లి నియోజకవర్గ ప్రజాప్రతిధులు కూడా ఇంత వరకు ఈ విషయమై సీఎం, మంత్రుల వద్ద ప్రస్తవన తేలేదు.

రాష్ట్రంలో ఏదైనా కొత్త మునిసిపాలిటీగా విస్తరించేందుకు చట్టం కావాలన్న అసెంబ్లీలో లేదా మంత్రి వర్గ సమావేశంలో కాని అమోదం కావాల్సి ఉంది. లేదా మునిసిపల్ (పరిపాలన) శాఖ కమిషనర్ నుంచి కూడా అమోదం చేస్తూ ఆదేశాలు వెలువడాల్సి ఉంది.. జిల్లాలోని ఖమ్మం రూరల్ మండలంలోని పెద్దతండ పంచాయతీని మునిసిపాలిటీగా చేసేందుకు ప్రభుత్వం ఆమోదం కూడా తెలిపిందని తెలిసింది. కాని కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీని ఉన్నతిగా చేసే విషయంలో ఏలాంటి ఆలోచన చేయలేదని తెలిసింది. గ్రామ పంచాయతీ ఎన్నికల నాటికి కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీ మునిసిపాలిటీగా(ఉన్నతిగా) మారడం ప్రశ్నార్థకంగా మిగిలిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చింతకాని, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులవంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990-93 పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. పాఠశాలలో ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి వరకు మధ్య చదివిన విద్యార్థులు 30 ఏళ్ల తరువాత ఒక్క చోట ఏకమయ్యారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను వారు నెమరవేసుకున్నారు. నాటి హెచ్‌ఎం నంజాల వీరయ్య, ఉపాధ్యాయులు మరీదు సత్యనారాయణ, పార్వతీలను సత్కరించారు. కార్యక్రమంలో జమ్మిశెట్టి నారాయణ, షేక్. అబ్బాసాహెబ్, బాహాటం ఫణిరాజు, కొల్లి బాబు, కందిమళ్ల నాగేశ్వరరావు, తన్నీరు మమత, నాగేంద్ర, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు